# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :35 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: గురువారం 03-04-2025 పేజీలు:4 వెల: 2.00


### ఉద్రిక్తంగా హెచ్‌సీయూ ప్రాంతాలు

హైదరాబాద్, హెచ్‌సీయూ భూములను కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి సర్కార్‌పై హెచ్‌సీయూ విద్యార్థులు పోరుబాట కొనసాగిస్తూనే ఉన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక బుధవారం ఉదయమే హెచ్‌సీయూ క్యాంపస్‌ను వేలాది మంది పోలీసులు చుట్టుముట్టారు. క్యాంపస్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ లోపలికి బయటి వ్యక్తులను రానివ్వకుండా, విద్యార్థులను బయటకు రానివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం ఉదయం హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రొఫెసర్లు, విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. దొరికిన విద్యార్థులను దొరికినట్లు లాఠీలతో చితకబాదారు. పోలీసుల తీరుపై ప్రొఫెసర్లు విద్యార్థులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినదిస్తూ, పోలీస్ జులుం నశించాలని నినాదాలు చేశారు. దీంతో హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

## మాపై ఆధిపత్యం వద్దు.. గల్లీలోకి రావాల్సిందే..



న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: బీసీ బిల్లు ఆలోచనకు స్ఫూర్తి రాహుల్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఅన్నారు. బుధవారం నాడు ఢిల్లీలోని జంతర్ మంతర్ బీసీ పోరు గర్జనలో సీఎం పాల్గొని ప్రసంగించారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీని బీసీల లెక్కలు అడిగారని తెలిపారు. ఎక్కడ అధికారంలోకి వచ్చినా కుల గణన చేస్తామని పాదయాత్రలో రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారన్నారు. పార్టీ విధానపరమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తెలంగాణలో నిలబెట్టానని తెలిపారు. తండ్రి కొడుకు ఉద్యోగం ఊడకొట్టండి మీకు ఉద్యోగాలు వస్తాయని ఎన్నికల సమయంలో పాదయాత్రలో చెప్పానన్నారు. అన్న ప్రకారమే ఏడాదిలో 59 వేల ఉద్యోగాలు నియమించామని తెలిపారు. బీసీలది ధర్మబద్ధ కోరిక అది నెరవేర్చాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. బీజేపీ అందుకు సిద్ధంగా లేదని విమర్శించారు. మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా బీజేపీ యాత్ర చేసిందన్నారు. ఇందిరాగాంధీ దళిత్ కాదని.. కానీ ఆమె అందరికీ భూములు ఇచ్చారని.. ఇల్లు కట్టించారని అన్నారు. అసైన్డ్ భూములు ఇందిరాగాంధీ ఇచ్చారన్నారు.

రాహుల్ మాట ప్రకారం

బీసీలకు 42% రిజర్వేషన్ల తీర్మానం ఆమోదించిన తేదీ ఫిబ్రవరి 4 అని.. ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్ డే గా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. జనగణనలో కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారన్నారు. అందుకే బీజేపీ కుట్రపూరితంగా జనగణన వాయిదా వేస్తోందని మండిపడ్డారు. తెలంగాణలో కులగణన చేసి బీసీల లెక్క 56.36 శాతం అని తేల్చిందని.. గుజరాత్ సహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదన్నారు. రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణ మొట్టమొదటి సారి కులగణన చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచమన్న డిమాండ్ మాత్రమే కాదు, ఉద్యోగ, విద్య రంగంలో కూడా ఈ పెంపు ఉండాలని నిర్ణయించామన్నారు. రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వ్యవహారమని.. అందుకే మేము తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని తెలిపారు.

అయినసూ హస్తిన పోయి రావలె

'మేము మా రాష్ట్రంలో పెంచుకుంటాం అన్నాం. మీ (మోదీ) రాష్ట్రంలో చేయమని మేము అడగలేదు. మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచితే నరేంద్ర మోదీకి వచ్చిన కష్టమేంటి? మా పిల్లల చదువులు, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాల కోసం 42 శాతం ఇవ్వాలని మేం ప్రయత్నం చేస్తుంటే.. మీకు ఏం కష్టం వచ్చింది? మా తీర్మానం ప్రకారం రిజర్వేషన్లు పెంచమని కోరుతూ బీజేపీ నేతలను బీసీ సంఘాలు కలిశాయి. అయినా ఉలుకు లేదు. పలుకు లేదు. అందుకే ఢిల్లీలో బీసీ మహా ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి బీసీ సంఘాలకు ఏర్పడింది. కురుక్షేత్ర యుద్ధంలో చెప్పినట్టు 'అయినసూ హస్తిన పోయి రావలె'.. అన్నట్లు ఢిల్లీకి వచ్చి ధర్నా చేస్తున్నారు. మా మీద ఆధిపత్యం చెలాయించాలని చూడొద్దు. నిజాం పాలకులకు ఏ గతి పట్టిందో చూశారు. ఆంధ్రా పాలకులకు ఏం జరిగిందో చూశారు. మీరెప్పుడూ ఢిల్లీలో ఉండరు. గల్లీలోకి రావాల్సిందే. చిన్న సాయం చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకునే జాతులు మా బీసీ జాతులు. ఈ జాతులకు అన్యాయం చేస్తే ఎలా మర్చిపోతారు? దేశమంతటా మీరు అమలు చేస్తారా లేదా అని నేను అడగడం లేదు. మా తెలంగాణలో తీర్మానం చేసిన ప్రకారం పెంచమని మాత్రమే అడుగుతున్నాను' అని రేవంత్ అన్నారు. రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించినా సరే అనేక బిల్లులు తెచ్చి చట్టాలు చేశారన్నారు. ట్రిపుల్ తలాఖ్ తెచ్చారని.. ఆర్టికల్ 370 రద్దు చేశారని... వ్యవసాయంపై నల్ల చట్టాలు తెచ్చారని తెలిపారు. మరి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఏం సమస్య వచ్చిందని ప్రశ్నించారు. బీసీల కోసం ప్రాణాలు ఇస్తామని బండి సంజయ్ అంటారని.. 'మాకు మీ ప్రాణాలు వద్దు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వండి చాలు' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన బీసీ గర్జన మహా ధర్నాకు వివిధ పార్టీల ఎంపీలు మద్దు తెలిపారు. అసదుద్దీన్ ఓవైసీ, డీఎంకే కనిమొలి, ఎన్సీపీ ఎంపీ సుప్రియ సూలే మహాధర్నాకు మద్దతు ఇస్తూ ధర్నాలో పాల్గొన్నారు. అలాగే ఈ ధర్నాకు ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్,కొండ సురేఖ, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు శ్రీహరి ముద్దిరాజు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, బీర్లా ఐలయ్య, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీ కోదండరాం, వి హెచ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ హాజరయ్యారు.

## దేశవ్యాప్తం ఉద్యమం చేస్తాం.. వక్ఫ్ బిల్లుపై ముస్లిం పర్సనల్ లాబోర్డ్ వార్నింగ్..

న్యూఢిల్లీ,ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు బుధవారం వక్ఫ్ సవరణ బిల్లుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. ఇది ముస్లింలకు ప్రయోజనకరం కాకుండా హానికరంగా ఉంటుందని పేర్కొంది. ఈ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందితే, దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం ప్రారంభిస్తామని ఆ సంస్థ ప్రతినిధి డాక్టర్ సయ్యద్ ఖాసి రసూల్ ఇలియాస్ వార్నింగ్ ఇచ్చారు. "మేము నిశ్శబ్దంగా కూర్చోము. మాకు అందుబాటులో ఉన్న అన్ని చట్టపరమైన,రాజ్యాంగ నిబంధనల్ని మేము ఉపయోగించుకుంటాము. ప్రతిపాదిత సవరణలను వెనక్కి తీసుకునే వరకు మేము శాంతియుత ఆందోళన నిర్వహిస్తాము" అని ఆయన అన్నారు. సంస్థకు చెందిన మరో వ్యక్తి మౌలానా ఖలీద్ రషీ ఫరంగి మహాలి మాట్లాడుతూ.. ముస్లిం సంస్థలు ఈ బిల్లుపై తమ ఆందోళనల్ని జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి తెలియజేసిందని, కానీ వాటిని పరిగణలోకి తీసుకోలేదని అన్నారు. ప్రార్థన, ఉపవాసం, తీర్థయాత్ర వంటి ప్రాథమిక ఇస్లామిక్ ఆచారాలతో పోల్చదగిన మతపరమైన ప్రాముఖ్యతను వక్ఫ్ ఆస్తులు కలిగి ఉన్నాయని ఆయన అన్నారు. పార్లమెంట్ సభ్యులంతా ముస్లిం సమాజం మనోభావాలను పరిగణలోకి తీసుకోవాలని, ప్రతిపాదిత సవరణల్ని తిరస్కరించాలని ముస్లిం పర్సనల్ లాబోర్డు సభ్యులు కోరారు. ఇదిలా ఉంటే, కొందరు న్యాయనిపుణులు ఈ బిల్లులోని నిబంధనల్ని స్వాగతించారు. వారణాసిలో న్యాయవాది విష్ణు శంకర్ జైన్ మాట్లాడుతూ.. ఈ బిల్లు గతంలో వక్ఫ్ బోర్డులకు ఉన్న అపరిమిత అధికారలను తగ్గించిందని, ఇది సానుకూల చర్య అని అన్నారు. బిల్లులోని కొన్ని అంశాలపై ఇంకా చర్చ అవసరమని ఆయన అన్నారు.



## కాంగ్రెస్ ఉంటే పార్లమెంట్‌ని కూడా "వక్ఫ్" స్వాధీనం చేసుకునేది..



న్యూఢిల్లీ,చారిత్రాత్మక వక్ఫ్ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. పార్లమెంటరీ, మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బిల్లును సభ ముందుంచారు. రిజిజు ప్రసంగం ప్రారంభించిన వెంటనే ప్రతిపక్షాలు అడ్డుకోవడానికి ప్రయత్నించాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి నిప్పులు చెరిగారు. 2014లో బీజేపీ అధికారంలోకి రాకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్, విమానాశ్రయ భూములను వక్ఫ్ ఇచ్చేదని అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ పార్లమెంట్‌ని వక్ఫ్ స్వాధీనం చేసుకోవడాన్ని ఆపేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చట్టానికి చేసిన మార్పులు ఇతర చట్టాల కన్నా అధిక ప్రభావం చూపించినందున వక్ఫ్ బిల్లుకు కొత్త సవరణలు అవసరమని రిజిజు అన్నారు. ఈ బిల్లు వల్ల ముస్లింలకు వచ్చే నష్టమేమీ లేదని, ఈ బిల్లును వ్యతిరేకిస్తున్న వారు తెలుసుకోవాలని కేంద్రమంత్రి సూచించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలో ఉంటే ఢిల్లీలోని కీలక స్థలాలు వక్ఫ్ సొంతమయ్యేవని అన్నారు. 123 ఆస్తుల్ని కాంగ్రెస్ వక్ఫ్ బోర్డుకు కట్టబెట్టిందని చెప్పారు. వక్ఫ్ చట్టంలోని లోపాలు అనేక ఉల్లంఘనలకు కారణమైందని అన్నారు. ఈ బిల్లు పేద ముస్లింలు, పిల్లలు, మహిళలకు ప్రయోజనాలు చేకూరుస్తుందని, వక్ఫ్ బోర్డు కింద ఆస్తుల నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకతను నిర్ధారిస్తుందని కిరణ్ రిజిజు వెల్లడించారు. 1970 నుండి ఢిల్లీలో పార్లమెంట్ భవనంతో సహా అనేక ఆస్తులకు సంబంధించిన కేసులు నడుస్తున్నాయని, ఢిల్లీ వక్ఫ్ బోర్డు వీటిని క్లెయిమ్ చేసింది, ఈ కేసు కోర్టులో ఉంది, అప్పటి యూపీఏ ప్రభుత్వం 123 ఆస్తుల్ని డీనోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు ఇచ్చిందని కిరణ్ రిజిజు అన్నారు. ఈ రోజు ఈ బిల్లు ప్రవేశపెట్టకపోతే, మనం కూర్చున్న పార్లమెంట్ కూడా వక్ఫ్ ఆస్తిగా క్లెయిమ్ చేస్తారని అన్నారు. ప్రధాని మోడీ అధికారంలోకి రాకుంటే మిగతా ఆస్తుల్ని కూడా వక్ఫ్ బోర్డుకు అప్పగించేవారని ఆయన చెప్పారు.

## సరిహద్దుల్లో కవ్వించి దెబ్బతిన్న పాక్ ఆర్మీ..

జమ్మూ:భారత్‌ని కవ్వించి పాకిస్తాన్ ఆర్మీ మూల్యం చెల్లించుకుంది. జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) వెంబడి పాకిస్తాన్ ఆర్మీ కాల్పులకు తెగబడింది. ఎల్‌ఓసీని దాటే ప్రయత్నం చేసినట్లు భారత ఆర్మీ చెప్పింది. పాక్ ఆర్మీ కాల్పులకు భారత ఆర్మీ ధీటుగా బదులిచ్చింది. ఈ కాల్పుల్లో 4-5 మంది చొరబాటుదారులను హతమార్చినట్లు ఇండియన్ ఆర్మీ వర్గాలు చెప్పాయి. పూంచ్ జిల్లాలోని కృష్ణ ఘాటి ప్రాంతంలో చొరబాటు ప్రయత్నాన్ని విజయవంతంగా తిప్పికొట్టామని సైన్యం తెలిపింది. మంగళవారం, పాకిస్తాన్ సైనికులు, చొరబాటుదారులు కాల్పులు జరపడంపై భారత్ సైన్యం ప్రతీకారం తీర్చుకుంది. పాకిస్తాన్ వైపు భారీ ప్రాణనష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఇటీవల కాలంలో పాకిస్తాన్ కాల్పులు విరమణ ఉల్లంఘనకు పాల్పడింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కృష్ణ ఘాటి సెక్టార్‌లో ఇలాంటి కాల్పుల ఘటన ఎదురైంది. అయితే, ఈ చొరబాటులను, పాక్ కవ్వింపులను భారత ఆర్మీ ధాటిగా తిప్పికొట్టింది. భారత్ వైపు నుంచి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని పేర్కొంది.

ఎల్‌ఓసీ వెంబడి కాల్పుల సంఘటనలు పెరిగే అవకాశం..

గత రెండు నెలలుగా దక్షిణ పిర్ పంజాల్ ప్రాంతొంలో ఎల్‌ఓసీ వెంబడి సరిహద్దు కాల్పుల సంఘటనలు గణనీయంగా పెరిగాయి. పాకిస్తాన్ స్నిపింగ్, కాల్పులు, బోర్డర్ యాక్షన్ టీం ప్రయత్నాలు పెరిగినట్లు నివేదికలు వస్తున్నాయి. పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుండటాన్ని భారత్ సైన్యం సమర్థవంతంగా ఎదుర్కొంటోంది. ఆర్మీ వర్గాల ప్రకారం, పాకిస్తాన్ దళాలు, పాక్ ఉగ్రవాదుల్ని భారత్‌లోకి చొప్పించడానికి ప్రయత్నిస్తోంది. పాక్ అంతర్గత సమస్యల నుంచి అక్కడి ప్రజల దృష్టిని మళ్లించేందుకు భారత్‌లో ఏదైనా దాడి చేయాలనే ఉద్దేశంలోనే పాక్ ఉగ్రవాదుల్ని ప్రేరేపిస్తోంది. వీరిని సరిహద్దు దాటించేందుకు, భారత సైన్యం దృష్టిని మళ్లించేందుకు సరిహద్దు వెంబడి కాల్పులు జరుపుతున్నట్లు తెలుస్తోంది.



## త్వరలోనే అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు

పెద్దపల్లి రూరల్ ఏప్రిల్ 02 : ఎన్నికల హామీలో బాగంగా ప్రజలకు ఇచ్చిన మాటప్రకారం అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను దశలవారిగా అందేలా చూస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలంలోని నిట్టూరులో రేషన్ షాపుల ద్వారా పంపిణి చేసే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వేణుతో కలిసి కార్డు దారులకు బుధవారం బియ్యం పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో పేదవర్గాల సంక్షేమం కోసమే ఈ ప్రభుత్వం పని చేస్తుందని ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటిని నేరవేరుస్తామని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వ పథకాల కోసం ఎంపిక చేసిన నిమ్మనపల్లిలో 153 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తే కేవలం 20 వరకు మాత్రమే పనులు ప్రారంభించారని, కొంతకాలం చూశాక కట్టుకోలేనివి క్యాన్సిల్ చేసి పెద్దపల్లి నియోజక వర్గంలో ఈ నెల 15 నుంచి ఊరికి 80 నుంచి100 ఇండ్లవరకు మంజూరు చేసి అర్హులైన వారందరరూ కట్టుకునేలా ఇల్లు కట్టుకునే వారందరికి వచ్చేలా చూస్తామన్నారు. అనంతరం పెద్దపల్లి మండలం నిట్టూరు ఊరచెరువు మత్తడి వద్ద రైతుల సౌకర్యార్థం రూ. 20 లక్షలతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణపనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపుకలెక్టర్ డి. వేణు, జిల్లా పౌరసరఫరాల అధికారి



రాజేందర్ , పెద్దపల్లి ఆర్డీవో బొద్దుల గంగయ్య, తహసీల్దార్ రాజయ్య యాదవ్, ఏవో, ప్రత్యేకాధికారి కాంతాల అలివేణి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు సీఐలు. ఎస్ ఐలతో బందోబస్తు

పెద్దపల్లి మండలం నిట్టూరులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ఉన్న నేపథ్యంలో బీజేపీ నాయకులు ప్రధాని మోదీ ఫోటో విషయంలో ఏమైనా ఆందోళన చేస్తారేమోనని ముందస్తుగా పెద్దపల్లి, సుల్తానాబాద్ సీఐలు ప్రవీణ్ కుమార్, సుబ్బారెడ్డి ల ఆధ్వర్యంలో ఎస్సై మల్లేష్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత కేసు.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..!



న్యూఢిల్లీ,ఢిల్లీలో బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీం కోర్టులో మరోసారి విచారణ ప్రారంభమైంది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గవాయ్, అగస్టీన్ జార్జ్ మసీహ్‌ల ద్విసభ్య ధర్మాసనం వాదనలు వింటోంది. కేసులో ఇప్పటికే బీఆర్ఎస్ తరఫున ఆర్యమా సుందరం వాదనలు వినిపించగా, అసెంబ్లీ స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తన వాదనలు వినిపిస్తున్నారు. కేసులో సింగిల్ బెంచ్ తీర్పును కొట్టేసిన డివిజన్ బెంచ్ తీర్పు సరైందేనని ముకుల్ రోహత్గీ పేర్కొన్నారు. స్పీకర్‌కు గడువు విధించిన హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు సరికాదని ఆయన వాదించారు. అయితే, ధర్మాసనం స్పష్టమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కేసులో అసెంబ్లీ స్పీకర్‌ను కూడా కోర్టులో నిలబెట్టామనే విషయాన్ని మర్చిపోవద్దని కోర్టు స్పష్టం చేసింది. పార్టీ ఫిరాయింపులను అడ్డుకునేందుకు రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ఉందని, అలాంటప్పుడు ఫిరాయింపులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే రాజ్యాంగాన్ని అవమానపరిచినట్లేనని కోర్టు తెలిపింది. ఈ కేసులో ఇప్పటికే బీఆర్ఎస్ వాదనలు ముగియగా, కేటీఆర్, కౌశిక్ రెడ్డి తరఫున న్యాయవాదులు స్పీకర్ నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకునేలా ఆదేశించాలని కోరారు. అయితే, కోర్టులు స్పీకర్‌ను ఆదేశించలేవని, కేవలం సూచన మాత్రమే చేయగలవని ప్రతివాదుల తరఫు లాయర్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించా రు. దీంతో అనర్హత పిటిషన్లపై నాలుగేళ్ల పాటు స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే కోర్టులు చూస్తూ ఊరుకోవాలా? అని న్యాయమూర్తి జస్టిస్ గవాయి ప్రశ్నించారు. తమ నిర్ణయాన్ని స్పీకర్‌కు తెలియజేస్తామని, ఆర్టికల్ 142 ప్రకారం కోర్టుల శక్తి పరిమితమైనది కాదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసిన తర్వాతే స్పీకర్ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారనే అంశాన్ని న్యాయమూ ర్తులు ప్రస్తావించారు. ముగ్గురు ఎమ్మెల్యేలపై మూడు వేర్వేరు సమయాల్లో పిటిషన్లు దాఖలైనందున నోటీసుల జారీకి ఆలస్యమైందని ముకుల్ రోహత్గీ వాదించారు. ఈ నేపథ్యంలో తదుపరి విచారణలో మరింత స్పష్టత రాబోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### సబ్బండ వర్గాల సమానత్వానికి పాటుపడిన పాపన్న

హైదరాబాద్,బహుజన పోరాట యోధుడు, సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాటుపడిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఘన నివాళు లర్పించారు. పాపన్న గౌడ్ స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు చాటేలా ప్రతి ఏటా వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు.

## భూముల కోసం పోరాడుతున్న విద్యార్థుల అరెస్టులను ఖండిస్తున్నాం..



హైదరాబాద్,హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెంట్రల్ యూనివర్సిటీ భూముల కోసం పోరాడుతున్న విద్యార్థులను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నాం అన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొనే విద్యార్థులని పెయిడ్ బ్యాచ్ అంటూ పిలవడం దారుణం అని పేర్కొన్నారు. పేమెంట్లతో పదవులు తెచ్చుకున్న మీరు విద్యార్థుల గురించి మాట్లాడే అర్హత లేదు అని తేల్చి చెప్పారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం ఆపండి అని కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరం మాట్లాడారు.. ఈయన కూడా పేమెంట్ లు తీసుకొని మాట్లాడారా అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. ఇక, భారతీయ జనతా పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. ఒక్క నిమిషంలో పోలీసులను బయటకు పంపొచ్చు అని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు. కానీ, బీజేపీ మొసలి కన్నీరు కారుస్తుంది.. బీజేపీ- కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని ఈ విషయంలో బయట పడింది అని ఆరోపించారు. డ్రోన్ కెమెరాలు ఎగరేస్తే 500 రూపాయల ఫైన్ వేయొచ్చు అని సీఎం అన్నారు.. కానీ, ఇప్పుడు డ్రోన్ లు ఎగుర వేశారని విద్యార్థులను అరెస్ట్ చేశారు అని పేర్కొన్నారు.

### ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

హైదరాబాద్ : విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. టెన్త్ పరీక్షల కోసం 5,09,403 మంది రిజిస్టర్ చేసుకోగా.. మొత్తం 2,650 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు న్విహించిన ఈ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నేడు సోషల్ స్టడీస్ పరీక్షతో పది పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. కాగా, పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు ఈ నెల చివరివారంలో విడుదలకానున్నాయి. ఓరియంటల్ సైన్స్‌కు సంబంధించిన రెండు పరీక్షలు ఈ నెల 3, 4 తేదీల్లో జరుగుతాయి.

## సంపాదకీయం

గురువారం 03-04-2025

# బంగ్లాతో మళ్లీ చెలిమి!

నిరుడు ఆగస్టులో జరిగిన తిరుగుబాటులో అప్పటి బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా పదవి కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నప్పటి నుంచీ భారత–బంగ్లాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో తొలిసారి ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశ ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్‌కు లేఖ రాయటం ఆహ్వానించదగ్గ పరిణామం. బంగ్లా జాతీయ దినోత్సవం సందర్భంగా త్యాగాల పునాదులపై నిర్మితమైన ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు. పదిహేనేళ్ల పాలించిన హసీనా మత ఛాందసుల్ని అదుపులో పెట్టడంలో సాధించిన విజయాలు ప్రశంసనీయమైనా, రిగ్గింగ్‌తో విజయాన్ని చేజిక్కించుకోవటం, విపక్ష నేతలను ఏళ్ల తరబడి జైళ్లపాలు చేయటం వంటి ధోరణుల్ని ఎవరూ జీర్ణించుకోలేక పోయారు. తిరుగుబాటు జరి గాక, జనం పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయింది. హసీనా పార్టీ అవామీ లీగ్ నేత లపైనా, కార్యకర్తలపైనా దాడులతో పాటు ఆ పార్టీకి మద్దతు పలికారంటూ పలువురి ఆస్తుల్ని ధ్వంసం చేయటం మితిమీరింది. ఈ అరాచకం ఆపకపోగా అంతా సవ్యంగా ఉందంటూ యూనుస్ దబాయింపులకు దిగారు. మతఛాందసులది పైచేయి అయి మహిళలపైనా, మైనారిటీ హిందూ వర్గంపైనా దాడులకు పూనుకుంటున్నా... వివిధ ప్రాంతాల్లో హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు బాగా పెరిగినా అదంతా తప్పుడు ప్రచారమని కొట్టిపారేశారు. గత డిసెంబర్‌లో ఆ దేశాన్ని సందర్శించిన మన విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి ఈ నేరాలకు సంబంధించిన సాక్ష్యాధారాలను బంగ్లా విదేశాంగ సలహాదారు మహమ్మద్ తౌహిద్ హుస్సేన్‌కు అందజేశారు. భౌగోళిక రాజకీయ కోణంలో బంగ్లాదేశ్‌తో చెలిమి భారత్‌కు చాలా అవసరం. అది చిన్న దేశమే అయినా దానితో మనకు 4,096 కిలోమీటర్ల మేర సరిహద్దువుంది. ఇందులో నదీ పరీవాహక ప్రాంతం వేయి కిలోమీటర్లపైన ఉంటుంది. తాగునీటికైనా, సాగునీటికైనా తీస్తా నదీజలాలు ఆ దేశానికి ప్రాణప్రదమైనవి. ఆ నది ప్రవహించే 315 కిలోమీటర్లలోనూ 130 కిలోమీటర్లు బంగ్లాదేశ్ భూభాగంలోనే ఉంటుంది. పశ్చిమబెంగాల్‌లోని గజల్‌దోబా బరాజ్ వల్ల భారీ మొత్తం జలాలు ఆ రాష్ట్రానికే పోతాయని, తమకు మిగిలేది అతి తక్కువని బంగ్లా వాదిస్తోంది. ఆ జలాల్లో తమకు 50 శాతం వాటా ఇవ్వాలని కోరుకుంటోంది. చివరకు కనీసం తొలి దశలో 25 శాతం ఇస్తే చాలని రాజీ కొచ్చింది కూడా. కానీ మమత అందుకు కూడా ససేమిరా అన్నారు. వాస్తవానికి 2011లో నాటి యూపీఏ ప్రధాని మన్మోహన్ సింగ్ తీస్తా నదీజలాల పంపకంపై బంగ్లాతో సూత్రప్రాయంగా అంగీకారానికొచ్చారు. ఒప్పందం రూపొందింది. కానీ అప్పుడు కూడా పశ్చిమ బెంగాల్ సీఎంగా వున్న మమత బెనర్జీ యూపీఏ భాగస్వామి కావటం, ఆ ఒప్పందానికి ఆమె ససేమిరా అనటంతో చివరి నిమిషంలో ఆగిపోయింది. ఫెనీ జలాల విషయంలోనూ ఇలాంటి పీటముడే పడింది. నదీజలాల అంశం తప్ప ఇతరేతర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు బాగుండేవి. భారత్ పెద్దన్న పాత్ర పోషిస్తున్నదని, తమ ప్రయోజనాలను బేఖాతరు చేస్తున్నదని బంగ్లా ప్రజానీకంలో చాన్నాళ్ల నుంచి అసంతృప్తి వుంది. దానికితోడు హసీనాకు భారత్ గట్టి మద్దతుదారుగా ఉండటంవల్లే ఆమె ఇష్టారాజ్యం సాగించిందని, లక్షలాదిమంది తమ కార్యకర్తలను జైళ్లలో పెట్టారని విపక్షాల ఆరోపణ. ఈశాన్య భారత్‌లో తరచు హింసాత్మక చర్యలకు పాల్పడుతూ బంగ్లాదేశ్ శిబిరాల్లో తలదాచుకునే మిలిటెంట్లను ఆమె హయాంలో భారత్‌కు అప్పగించేవారు. ఇది కూడా అక్కడి ఛాందసవాదులకు మింగుడుపడలేదు. అయినా ఇరు దేశాలూ ఉమ్మడిగా ఎదుర్కొనాల్సిన సమస్యలు ఉన్నాయి. ఉదాహరణకు టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మించతలపెట్టిన మెదాగ్ జలవిద్యుత్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి పెద్దది కాబోతోంది. అది మనతోపాటు బంగ్లాదేశ్ ప్రయోజనాలకు కూడా ముప్పు కలిగిస్తుంది. బంగ్లా సాగు అవసరాల్లో 55 శాతం బ్రహ్మపుత్ర నదీజలాలు తీరుస్తాయి. చైనాలోని టిబెట్‌లో యార్లుంగ్ సాంగ్పోగా మొదలై మన దేశంలో ప్రవేశించేసరికి బ్రహ్మపుత్ర అయి, బంగ్లాలో అది జమునా నదిగా మారుతుంది. ప్రస్తుత బంగ్లా వాటా జలాల్లో 5 శాతం తగ్గినా సాగు ఉత్పత్తులు 15 శాతం పడిపోతాయని మూడేళ్ల క్రితం బంగ్లా పర్యావరణ శాఖ అంచనా వేసింది. బరాజ్ నిర్మిస్తున్న ప్రాంతం భూకంపాలపరంగా ప్రమాదకరమైనది. భూ అంతర్భాగంలోని టిబెట్ పలక చురుగ్గా ఉండటమే ఇందుకు కారణం. దీనిపై ఇప్పటికే మన దేశం చైనాకు ఆందోళనను తెలియజేయగా, బంగ్లాదేశ్ సైతం ఆ బరాజ్ ప్రభావంపై రూపొందించిన నివేదికలు తమకందించాలని ఆ దేశానికి లేఖ రాసింది. బంగ్లా విముక్తి దినోత్సవంపై ప్రస్తుత పాలకులకు అంత పట్టింపు లేదు. హసీనా పతనానికి దారితీసిన ఉద్యమానికి నాయకత్వం వహించి, ప్రస్తుత ప్రభుత్వంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న విద్యార్థులు తమది తటస్థ దేశంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఆ ఆశయంతో గణతాంత్రిక్ ఛాత్ర సంగ్సద్ (ప్రజాతంత్ర విద్యార్థి మండలి) పేరిట గత నెలలో పార్టీ స్థాపించారు. అయితే ఛాందసవాదులు దీన్ని ఎంతవరకూ సాగనిస్తారో తెలియదు. దేశాన్ని మళ్లీ తూర్పు పాకిస్తాన్‌గా మార్చాలని వారు తహతహలాడుతున్నారు. ఇస్లామిక్ సంప్రదాయాలను అమలు చేయాలని చూస్తున్నారు. వచ్చే నెల 2 నుంచి 4 వరకూ బ్యాంకాక్‌లో జరిగే బంగాళాఖాత దేశాల ఆర్థిక సహకార సంఘం బిమ్‌స్టెక్ సమావేశం సందర్భంగా మోదీతో భేటీకి బంగ్లా ఆసక్తి చూపుతోంది. తాజా పరిణామంతో అది సాకారమైతే మళ్లీ ఇరు దేశాల స్నేహసంబంధాలూ పట్టాలెక్కుతాయి.

# ‘విముక్తి’ తీరుతెన్నులెలా?!



వాషింగ్టన్:‘అమెరికా విముక్తి దినం’గా ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన రోజు రానేవచ్చింది. ఇన్నాళ్లూ ‘అన్యాయమైన సుంకాల’తో ‘అధ్వాన్నమైపోయిన’ అమెరికాకు ఏప్రిల్ 2 (బుధవారం) నుంచి విముక్తి లభించి, లక్షల కోట్ల డాలర్లు ఆర్జించి పెట్టగల ప్రతి సుంకాల మోత మోగబోతున్నదని దేశ ప్రజలను ఆయన ఊరిస్తున్నారు. విలక్షణమైన ప్రకటనలతో ఏకకాలంలో తన భక్త గణాన్నీ, ప్రత్యర్థులనూ రంజింపజేయటం ట్రంప్ ప్రత్యేకత. అయితే ఆయన విధించబోయే సుంకాల రంగు, రుచి, వాసన ఆ రెండు వర్గాలకూ అంతుబట్టడం మాట అటుంచి... కొమ్ములు తిరిగిన ఆర్థికవేత్తల అవగాహనకే అందటం లేదు. ట్రంప్ చర్య వల్ల ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటుందని మాత్రం ఆర్థికవేత్తలు జోస్యం చెబుతున్నారు. ఆడం స్మిత్, డేవిడ్ రికార్డో వంటి 18, 19 శతాబ్దాల నాటి స్వేచ్ఛా మార్కెట్ ఆర్థికవేత్తల ఆలోచనల్నించి బయటికొస్తేనే ట్రంప్ అర్థమవుతారని ఆర్థిక నిపుణులు కొందరి వాదన. ట్రంప్ ఒక మాట మీదవుంటే కాస్తయినా అర్థమయ్యే వారు. కానీ ఆయన రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఒకసారి మిత్ర దేశాలకైనా, వేరే దేశాలకైనా ఒకటే నిబంధన అంటారు. మరోసారి తద్విరుద్ధంగా మిత్ర దేశాలతో చర్చించి పరిష్కరించుకుంటామంటారు. ఆ మాటెలావున్నా తొలిసారి అధ్యక్షుడైనప్పుడు 2018%-%19 మధ్య ట్రంప్ చైనాపై విధించిన ప్రతి సుంకాల ప్రభావం ద్రవ్యోల్బణంపై పెద్దగా లేదుగనుక, ఇప్పుడూ ఉండకపోవచ్చని కొందరి మాట.ట్రంప్ ప్రకటించబోయే ప్రతి సుంకాల తీరుతెన్నులెలావుంటాయో ఆయన సన్నిహిత సలహా దారులకు సైతం ఇంతవరకూ తెలియదు. ప్రతి సుంకాలు మధ్యస్థంగా, పరస్పరం చర్చించి పరిష్క రించుకునే విధంగా ఉంటాయని అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బిసెంట్ గత నెలలో తెలిపారు. కీలక వాణిజ్య భాగస్వామ్య దేశాలతో విడివిడిగా చర్చించి ఒప్పందానికొస్తామని అన్నారు. మన వంతుగా ఎలాంటి చర్యలుంటాయో ప్రభుత్వం ఇంతవరకూ వెల్లడించలేదు. కానీ భారత్ తరఫున ట్రంప్ ఇప్పటికే ఒకటి రెండు ప్రకటనలు చేశారు. అమెరికా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించటానికి భారత్ అంగీకరించిందని ట్రంప్ పక్షం రోజులనాడు చెబితే దానిపై విపక్షాలు పార్లమెంటులో ప్రభుత్వాన్ని నిలదీశాయి. ఇంతవరకూ ఆ విషయంలో ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని, అమెరికాకు చెప్పింది కూడా లేదని ప్రభుత్వం వివరించింది. మంగళవారం మరోసారి ఆయన అదే తరహాలో మాట్లాడారు. భారత్ గణనీయంగా సుంకాలు తగ్గించబోతున్నట్టు ‘కొద్దిసేపటి క్రితమే’ తనకు సమాచారం అందిందన్నారు. దీనిపై మన ప్రభుత్వం స్పందించలేదు. కానీ యూరప్ నుంచి అమెరికాకు పెను సవాల్ ఎదురుకాబోతున్నదని యూరోపియన్ యూనియన్ (ఈయూ) చేసిన ప్రకటన సూచిస్తోంది. ‘అమెరికా ప్రతి సుంకాలు ఏ స్థాయిలోవున్నాయో తెలిసిన వెంటనే ఏం చేయాలన్న అంశంలో పకడ్బందీ ప్రణాళిక సిద్ధమైంద’ని ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయన్ తెలియజేశారు. యూరప్ నుంచి వచ్చే స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులపై 2,800 కోట్ల డాలర్ల మేర సుంకాలు విధించినట్టు గత నెలలో ట్రంప్ ప్రకటించిన వెంటనే, ఆ దేశం నుంచి దిగుమతి చేసుకునే మోటార్ సైకిళ్లు, బోట్లు, మద్యం వగైరాలపై ఈయూ సైతం భారీ సుంకాలు విధించింది. అయితే అదే సమయంలో అమెరికా నుంచి వచ్చే కార్లపై 2.5 శాతం మేర సుంకాలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. అమెరికా– ఈయూల మధ్య వార్షిక వాణిజ్యం లక్షన్నర కోట్ల డాలర్లు. యూరప్‌తో సాగుతున్న వాణిజ్యంపై అమెరికాలో 10 లక్షల ఉద్యోగాలు ఆధారపడివున్నాయి. ఈ ‘విముక్తి’ సుంకాల రగడ పర్యవసానంగా మనతోపాటు అమెరికా, యూరప్, లండన్, జపాన్, హాంకాంగ్ తదితర ప్రపంచమార్కెట్లన్నీ పల్టీలు కొడుతున్నాయి. అన్నిచోట్లా అమెరికా షేర్లు పతనమవుతున్నాయి. చాలామంది ఈ సుంకాలెలా ఉండబోతున్నాయో తెలిసేవరకూ వేచి చూసే ధోరణిలో ఉండబట్టి కొంత నిలకడ కనబడుతోంది. కానీ ట్రంప్ అన్నంతపనీ చేస్తే ప్రపంచ మార్కె ట్లకు బుధవారం శాపగ్రస్త దినం కావడం ఖాయం. సుంకాలు పెంచటంవల్ల అమెరికాకు దిగుమ తయ్యే సరుకుల ధరలు ఆకాశాన్నంటుతాయి. ఏటా అమెరికా 3 లక్షల కోట్ల డాలర్ల సరుకును దిగుమతి చేసుకుంటుంది. సరుకుతో నిమిత్తం లేకుండా అన్నిటిపైనా 20 శాతం అదనంగా సుంకం విధిస్తామని ట్రంప్ చెబుతున్నారు. ఈ లెక్కన ఏటా 60,000 కోట్ల డాలర్ల ఆదాయం లభిస్తుంది. కానీ ఈ భారాన్ని చివరకు దేశ పౌరులే మోయాల్సివుంటుందని, అది భారమవుతుందని ట్రంప్ గ్రహించటం లేదు. ఇప్పటికే జీవనవ్యయం పెరిగి, బ్యాంకుఖాతాలు ఖాళీ అవుతూ, ఉద్యోగాలు కోల్పోయే స్థితి వుండగా, ప్రతి సుంకాలతో ఇది మరింత విషమిస్తుంది. మాంద్యం ముంచుకొస్తుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థను సుస్థిరపరుస్తానని, ఉద్యోగాల విషయంలో శ్వేతజాతి అమెరికన్ కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దుతానని ట్రంప్ ఇచ్చిన హామీని నమ్మి జనం ఆయన్ను భారీ మెజారిటీతో గెలిపించారు. కానీ అందుకు విరుద్ధంగా అమలులో ఉన్న అంతర్జాతీయ అమరికను ధ్వంసం చేసే పనిలో ట్రంప్ బిజీగా ఉన్నారు. ఆయన చర్యలు దేశాన్ని 1930నాటి ఆర్థిక మాంద్యం రోజులకు తీసుకెళ్లినా ఆశ్చర్యం లేదని పలువురి మాట. 1930 జూలైలో నాటి అధ్యక్షుడు హెర్బర్ట్ హూవర్ స్మూట్%–%హాలీ ట్యారిఫ్ చట్టాన్ని తీసుకురావటంతో అమెరికా దిగుమతులు 67 శాతం పడిపోయి ఆ దేశ ఆర్థికవ్యవస్థ కళ్లు తేలేసింది. ఇప్పుడు ట్రంప్ అలాంటి దుస్సాహసానికి దిగబోతున్నారు. పర్యవసానాలెలావుంటాయో చూడటం తప్ప ప్రపంచంలో దీన్ని నివారించగల వారెవరూ లేరు.

### 5నుంచి ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు

కడప,ఒంటిమిట్ట ఏకశిలానగరంలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఆలయంలో ఏప్రిల్ 5 నుండి 14వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు

# బెట్టింగ్ యాప్‌లకు జీవితాలు బలి

హైదరాబాద్,ప్రస్తుతం బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసేవాళ్లపై తెలంగాణ పోలీసులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొందరు ఇంకా యాప్స్ ప్రమోషన్‌ను ఆపడం లేదు. దేశవ్యాప్తంగా బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తూ కోట్లలో సంపాదిస్తున్నవాళ్లు వేల మంది ఉన్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో సెలబ్రిటీలే కాకుండా మరికొందరు బెట్టింగ్ టిప్స్ మాటున యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారు. టెలిగ్రామ్‌లో బెట్టింగ్ టిప్స్ పేరుతో ఛానళ్లు ఓపెన్ చేసి, అందులో మ్యాచ్ ప్రిడక్షన్స్ చెబుతూ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారు. ఇలా ఈజీ మనీ కోసం అలవాటు పడినటువంటి చాలా మంది యువతీ యువకులు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆటలు ఆడి తమ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.సరదాగా ఆడటం మొదలుపెట్టి, ఆ ఆటలకు బానిసై, పెయిడ్ గేమ్స్, బెట్టింగ్ గేమ్స్ ఆడి దాచుకున్న డబ్బులను కోల్పోయి అప్పుల ఊబిలో చిక్కుకుపోయి, అప్పులు కట్టలేక తమ ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. అప్పుల పాలైనటువంటి వారు తిరిగి కట్టలేక ఇంట్లో వాళ్లకు చెప్పలేక, తమ ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇంకొందరైతే అప్పులు తీర్చేందుకు దొంగలుగా, చైన్స్ స్నాచర్లుగా, సైబర్ నేరగాళ్లుగా మారుతున్నారు.డబ్బుల కోసం ఇంట్లో వారిని చంపడానికి కూడా వెనకాడడం లేదు. బంధాలు బంధుత్వాలను కూడా మరిచి ప్రాణాలను తీస్తున్నారు. ఈ పెయిడ్ గేమ్స్, ఆన్‌లైన్ గేమ్స్ బారినపడి నేటి యువత తన భవిష్యత్తును నాశనం చేసుకుంటుంది. ఇందులో ఎక్కువగా 20 నుండి 35 సంవత్సరాల వయస్కులు ఎక్కువగా ఉండడం అందరినీ ఆందోళన కలిగించే విషయం. ఈజీ మనీ కోసం అలవాటు పడినటువంటి వారు ఇంటర్నెట్‌లో లేదా స్మార్ట్ ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లను వెతికి అందులోని రమ్మి, ఐపిఎల్ బెట్టింగ్, ఫ్రీ మనీ ఎర్నింగ్ యాప్స్ అని ఎన్నో యాప్‌లను ఉపయోగిస్తూ ఆన్ లైన్‌లో సరదాగా మొదలుపెట్టిన ఆటలు, చివరికి వాటికి అలవాటు పడి జీవితాన్ని బలి తీసుకునే దిశగా వెళ్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా టెలిగ్రామ్‌లో క్రికెట్ అనలిస్టు పేరుతో ఒకరు, సౌత్ ఇండియా కింగ్ పేరుతో మరొకరు విపరీతంగా బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారు. ప్రిడక్షన్స్ ఇవ్వడం ద్వారా మీరు లాభాలు సంపాదించండంటూ తమ ఛానల్‌ను, బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారు. ఇలా టెలిగ్రామ్, వాట్సప్‌లో గ్రూపులు ఓపెన్ చేస్తూ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌ను చాలా మంది ఓ వృత్తిగా ఎంచుకుంటున్నారు. కొందరికి అవి ఆన్‌లైన్ గేమ్స్ అని, క్రికెట్ బెట్టింగ్ అని తెలియకుండానే ఆ ఊబిలో చిక్కుకొని పోతున్నారు.కరోనా సమయంలో పిల్లలకు ఆన్ లైన్ క్లాసులు జరిగేవి. అలాంటి సమయంలో పాఠశాల విద్యార్థులు మొదలుకొని కళాశాలలో చదువుకునేటువంటి యువతీ యువకులు, నిరుద్యోగులు, ఉద్యోగ ఉపాధి లేనివారు ఈజీగా డబ్బులు సంపాదించాలనే యావతో ఆన్ లైన్ ఆటలకు అడిక్ట్ అయ్యి, వాటిపై ఇంట్రెస్ట్ చూపి, డబ్బులు డిపాజిట్ చేసి గేమ్ ఆడితే సంపాదించవచ్చు అన్న ఆశలతో అప్పులు చేసి, అప్పుల ఊబిలో కూరుకుపోయి కష్టపడి సంపాదించిన దాన్నంతా కూడా పోగొట్టుకుంటున్నారు. బెట్టింగులను ఆర్గనైజ్ చేసే వాళ్ళు మొదట్లో కావాలనే కొంత డబ్బును యూజర్లు గెలుచుకునేలా చేస్తారు. దీంతో ఉత్సాహంగా మరింత సొమ్ము తెచ్చి గేమ్స్ ఆడుతూ బెట్టింగ్ కడుతుంటారు. డబ్బులు పోగొట్టుకున్నా మళ్లీ రాకపోతాయని ప్రయత్నిస్తూ నిండా మునిగిపోతుంటారు. కొద్ది రోజులుగా రాష్ట్రంలో చాలా మంది యూత్ ఇలాగే నష్టపోయారు. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు వివిధ రకాల యాప్‌లు , వెబ్ సైట్‌ల ద్వారా బిజినెస్ చేస్తున్నాయి. ఇప్పుడు గూగుల్, పేటిఎం, ఫోన్ పేలో ద్వారా కూడా ఈ ఆటలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. కొన్ని సంస్థలు పెయిడ్ గేమ్స్ ద్వారా గేమర్స్‌కి మనీ ఇస్తున్నాయి.ఆన్‌లైన్ రమ్మీ వంటి గేమ్‌లకు రూ. 50 నుంచి కూడా డబ్బు పెట్టే చాన్స్ ఉంటుంది. ముందు కొంత అమౌంట్ గేమ్ ఆడే వారి అకౌంట్‌లోకి వస్తుంది. దీంతో పాటు గేమ్‌లకు రివార్డ్ ఇస్తూ ఆకర్షిస్తుంటారు. టి 20లు,




వన్ డేలు, ఐపిఎల్, ఆఖరికి టెస్ట్ మ్యాచ్‌లు, ప్రో కబడ్డీ, రమ్మీ, పేకాట వీడియో గేమ్స్ ఇలా ఆన్ లైన్ మోసానికి బలవుతూ ఉన్నారు. ఇవేకాక ఆన్ లైన్ స్పాట్, బ్లాక్ జాక్, బక్కట్ పోకర్, తీన్ పట్టి, అందరు బహార్, ఆన్‌లైన్ క్యాష్‌ను ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో యాప్‌లు, ఆన్‌లైన్‌లో మోసాలు పెరిగిపోయి, మొదట్లో రూపాయల్లో ఆశపెట్టి వందల్లో లాభాలు చూపి, తర్వాత వేళల్లో ఆశపెట్టి లక్షలు దోచేస్తున్నారు. నేటి యువతీ యువకులకు పలు రకాల ఆటలపై ప్రజల్లో ఉన్న మోజును క్యాష్ చేసుకునేందుకు నకిలీ యాప్‌లను సృష్టించి, వాటి ద్వారా కూడా సులువుగా డబ్బులు సంపాదిస్తున్నారు. ఈ బెట్టింగ్ ఆన్ లైన్ గేమ్‌ల ద్వారా, బెట్టింగ్ యాప్‌ల ద్వారా, ఇంకా కొన్ని యాప్‌ల గనుక చూస్తే ఇంకా ముందుకు వెళ్లి వారే రుణాలు ఇస్తూ మళ్లీ డబ్బులు కట్టించి అదే గేమ్‌కు బానిసగా కూడా చేస్తున్నారు.స్మార్ట్ ఫోన్లు రాకముందు ప్రశాంతమైన జీవితం గడిపినటువంటి వారు స్మార్ట్ ఫోన్లు వచ్చిన తర్వాత జీవితాలను బలి తీసుకుంటున్నారు. ఈ ఆన్ లైన్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు చైనా, సౌదీ అరేబియా, అరబ్ దేశాల నుంచి ఆపరేటింగ్ చేస్తుంటారు. ఇటీవల చత్తీస్‌గఢ్ లో వెలుగు చూసిన మహాదేవ యాప్ కేసులో ఇదే విషయం తేటతెల్లమైంది. ప్రముఖులతో యాడ్స్ ఇప్పించడం అమాయకులను ముగ్గులోకి దించడం ద్వారా డబ్బులు వసూలు చేయడం, మొత్తంగా ఆటలకు బానిసలు చేయడం నిత్యకృతమైంది. ఇటీవల కాలంలో ఒక కలెక్టర్ దగ్గర పనిచేసేటువంటి గన్‌మెన్ సైతం అప్పుల ఊబిలో చిక్కి తన కుటుంబంతో సహా ప్రాణాలను కోల్పోయారు. ఇలా ఆన్‌లైన్ మోసాలతో దేశంలో కొన్ని వందల మంది ప్రాణాలను కోల్పోవడం జరుగుతున్నది. ఈ దారుణాలు జరుగుతున్నటువంటి క్రమంలో స్మార్ట్‌ఫోన్ల వాడకం తగ్గించడం మేలు. ఖాళీగా ఉంటూ ఏదైనా చూస్తున్న కొద్దీ ఏవేవో ప్రకటనలు, ఆకర్షించే బొమ్మలు, ఆటలు, మన డిస్‌ప్లే మీద ఆకర్షిస్తూ ఉంటాయి. మరి అలాంటి తరుణంలో వాటి జోలికి పోకుండా వాటిని యాపులను డౌన్‌లోడ్ చేసుకోకుండా ఉంటే మంచిది. వాటి మీద టచ్ చేస్తే ఆ యాప్‌లు డౌన్‌లోడ్ అయి మీ అకౌంట్లో ఉన్నటువంటి డబ్బులు గానీ లేదా డబ్బులు పెట్టి నష్టపోయేటువంటి పరిస్థితి గానీ వస్తుంది. దానివల్ల ఇంట్లో అనర్థాలు, ఇబ్బందులు, అప్పుల గొడవలు, మనస్పర్ధలు, ప్రశాంతత లేక ఆత్మహత్యల ఆలోచనలు వచ్చే ప్రాణాలనే బలి తీసుకునేటువంటి అవకాశం ఉంటుంది. అందుకే స్మార్ట్ ఫోన్‌లో కానీ, ఇంటర్నెట్‌లో కానీ తెలిసినటువంటి యాపులను వినియోగించడం మంచిది. తెలియని యాప్‌ల జోలికి వెళ్ళకూడదు. ముఖ్యంగా బెట్టింగ్ యాప్స్ బారిన పడి లక్షల్లో అప్పులు చేసి తీర్చలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతూ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న ఘటనలు అధికంగా జరుగుతున్న వేళ ఈ యాప్స్ ప్రమోషన్‌తో పాటు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది. అలాగే వారిపై చర్యలు తీసుకొని, ఉజ్వల భవిష్యత్తు వున్న భవితను కాపాడుదామని ఆశిద్దాం.

# వెన్నాడిన అమెరికా టారిఫ్ భయాలు

న్యూఢిల్లీ,దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం భారీ నష్టాలతో ముగిశాయి. అమెరికా టారిఫ్‌లు భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు భారీగా నష్టపోయాయి. ఇంట్రాడేలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 1400 పాయింట్లకు పైగా క్షీణించగా.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 23,200 మార్క్ దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3.5 లక్షల కోట్లు– క్షీణించి రూ.409 లక్షల కోట్లకు పడిపోయింది. సెన్సెక్స్ ఉదయం 76,882.58 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,912.18 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1390.41 పాయింట్ల నష్టంతో 76,024.51 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 353.65 పాయింట్ల నష్టంతో 23,165 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయం ప్రకటించనున్న నేపథ్యంలో సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొ న్నాయి. దేశీయ ఐటీ కంపెనీలకు అమెరికా నుంచే ప్రధానంగా ఆదాయం వస్తుంది. అలాంటిది అమెరికాలో ఐటీ–కి ఆశించిన మేర డిమాండ్ ఉండకపోవచ్చనే అంచనాలతో ఐటీ– స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టీ–, హెచ్‌సీఎల్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇటీ–వల 70 డాలర్ల వద్ద ట్రేడయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర మళ్లీ 75 డాలర్ల స్థాయికి చేరింది. భారత్ చమురును ప్రధానంగా దిగుమతి చేసుకునే దేశం కావడంతో మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇటీ–వల దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా 8 సెషన్లలో దాదాపు 5 శాతానికి పైగా పెరిగాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం కూడా మరో కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లలో అమ్మకాలు సూచీలను డీలాపడేలా చేశాయి. వొడాఫోన్ ఐడియాలో వాటాను పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించడంతో ఆ టెలికాం కంపెనీ షేర్లు నేడు 20 శాతం మేర రాణించాయి. స్పెక్ట్రమ్ కోసం వొడాఫోన్ ఐడియా చెల్లించాల్సిన మొత్తానికి సంబంధించి తాజాగా ఈక్విటీ– షేర్లను ప్రభుత్వానికి కేటాయిస్తున్నట్లు– సంస్థ తెలిపింది. వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 22.6 శాతం వాటా ఉండగా.. అది తాజాగా 49 శాతానికి పెరిగింది.

# హామీల అమలులో రేవంత్ విఫలం

హైదరాబాద్,రైతు భరోసా అమలు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తన మాటను నిలబెట్టుకోలేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, మాట తప్పడం, రైతులను మోసం చేయడం రేవంత్ రెడ్డికి అలవాటు–గా మారిందని ఆయన ధ్వజమెత్తారు. జనవరి 26న రైతు భరోసా కింద ఇచ్చే డబ్బులను మార్చి 31లోగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారని, ఆ హామీ ఇంకా నెరవేరలేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనూ మార్చి 31 కల్లా రైతులందరికీ రైతు భరోసా అందజేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఏప్రిల్ 1వ తేదీ వచ్చేసినా ఆ నిధుల గురించి ఎలాంటి ప్రకటన రాలేదని ఆయన మండిపడ్డారు. ఉగాది పండుగను పురస్కరించుకుని రైతులు రైతు భరోసా నిధుల కోసం ఎదురుచూశారని, అయితే వారికి ప్రభుత్వం చేదు అనుభవం మిగిల్చిందని హరీష్ రావు విమర్శించారు. దసరాకు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, సంక్రాంతికి అందిస్తామన్నా నిధులు రాలేదని, ఉగాది నాటికి కూడా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడం బాధాకరమన్నారు. కాలండర్లు మారుతున్నా రేవంత్ రెడ్డి మాట మాత్రం మారడం లేదని ఎద్దేవా చేశారు. నాట్ల సీజన్‌లో కేసీఆర్ రైతులకు రైతు బంధు అందించారని, కానీ రేవంత్ రెడ్డి కోతల సమయం వచ్చినా రైతు భరోసా అందించలేకపోయారని హరీష్ రావు ఆరోపించారు. మోసపూరిత పాలననే విధానంగా మార్చుకున్న రేవంత్ రెడ్డి రైతులను అన్ని కోణాల్లో దగా చేస్తున్నారని ఆరోపించారు.రుణమాఫీ వాగ్దానం ఇంకా నెరవేరలేదు. ఇందిరమ్మ భరోసా పథకం కేవలం మాటలకే పరిమితమైంది. హామీలు నెరవేర్చకుండా మోసం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిపోయింది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగానే, అసెంబ్లీలో ప్రకటించినట్లుగానే రైతు భరోసా నిధులు అందించే వరకు బీఆర్ఎస్ పార్టీ రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తూనే ఉంటు–ంది. ప్రజల్లో మీ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటుందని హరీష్ రావు హెచ్చరించారు.

# రాజకీయ లబ్ధి కోసం లేనిపోని ఆరోపణలు

హైదరాబాద్, ఎటువంటి పరిస్థితుల్లోనూ సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులకు నష్టం కలిగించే ప్రయత్నం చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయబోరని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ప్రతీ విషయాన్ని రాజకీయం చేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే కుట్ర బీజేపీ, బీఆర్ఎస్ కలసికట్టుగా చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలు తీసుకుంటు–న్నారని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. అభివృద్ధి చెందే రాష్ట్రంలో భూములు ఆదాయ వనరుగా మారాలని ప్రభుత్వం భావిస్తోందని, విద్యార్థులకు ఏమాత్రం నష్టం కలగకుండా ప్రభుత్వ విధానాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ పక్కన ఉన్న సర్వే నెంబర్ 25లో గల 400 ఎకరాల భూమిని సీఎం రేవంత్ రెడ్డి కోర్టులో పోరాటం చేసి సాధించారని అద్దంకి దయాకర్ తెలిపారు. చట్టాలను గౌరవిస్తూ, న్యాయపరమైన మార్గంలోనే భూమిని రాబట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. ఈ భూమిని అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదాయం తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్, కేటీఆర్ ఈ భూములను వేలం వేసి ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించాలని చూశారని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించిందని అద్దంకి దయాకర్ గుర్తుచేశారు. అందువల్లే ఈ భూమి ఇప్పటికి ప్రభుత్వ ఆధీనంలో ఉందని, విద్యార్థులకు నష్టం కలగకుండా రేవంత్ రెడ్డి అన్ని జాగ్రత్తలు తీసుకుంటు–న్నారని తెలిపారు. 1970లలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ కోసం 2500 ఎకరాల భూమిని కేటాయిం చారని అద్దంకి దయాకర్ తెలిపారు.

## ఈ రెండు నెలలు అత్యధిక ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ,దేశంలో ఈసారి ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశంలోని పశ్చిమ, తూర్పు ప్రాంతాలు మినహా చాలా చోట్ల సాధారణ స్థాయి కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, వాయువ్య, మధ్య, తూర్పు ప్రాంతాల్లో ఎక్కువ రోజులపాటు– వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ సారి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు– పలు రాష్ట్రాల్లో సాధారణ స్థాయికి మించి 2 నుంచి 4 రోజులపాటు– తీవ్రమైన వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నదని స్పష్టం చేసింది.మంగళవారం నుంచి శుక్రవారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు తగ్గుతాయని ఐఎండీ తెలిపింది. శనివారం ఉత్తరాంధ్రలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ప్రస్తుత వేసవిలో ఏప్రిల్–జూన్ మధ్య ఎండలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని భారత వాతావరణ విభాగం ఐఎండీ అంచనా వేస్తోంది. మధ్య, తూర్పు ప్రాంతాల్లో, వాయవ్య రాష్ట్రాల్లో కువరోజులు వడగాలులు వీస్తాయని హెచ్చరించింది. ఎక్కువ ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి మించి నమోదవుతాయని, కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా పలుచోట్ల సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని ఐఎండీ తెలిపింది. రాబోయే మూడు నెలలపాటు– అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే రెండు నుంచి నాలుగు రోజులు ఎక్కువగా వడగాలులు వీస్తాయని తెలిపింది. మామూలుగానే ఏప్రిల్, నెలల్లో వడగాలులు నమోదవుతుంటాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హరియాణా, బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువగా వడగాలుల రోజులు కొనసాగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఏప్రిల్‌లో దేశంలో చాలా ప్రాంతాల్లో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎండీ తెలిపింది.ఏపిలో దాదాపు అన్ని జిల్లాల్లోనూ వడగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని ప్రకటించింది. సోమవారం నంద్యాల జిల్లా గోస్పాడులో 40.3, కర్నూలు జిల్లా కమ్మరచేడులో 40.2, అనంతపురం జిల్లా నాగసముద్రంలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో వేడి, ఉక్కపోత నుంచి ప్రజలకు కొంత ఉపశమనం లభించనుంది.

## తిరుపతి కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి, తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు మంగళవారం ఉదయం 8 గంటలకు స్వామివారు హనుమంత వాహనంపై అభయమిచ్చారు. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. త్రేతాయుగంలో రామభక్తునిగా, భగవద్భక్తుల్లో అగ్రగణ్యుడుగా ప్రసిద్ధిగాంచిన వాడు హనుమంతుడు. రాముడు భక్తాగ్రగణ్యుడైన హనుమకు ఆత్మతత్వాన్ని బోధించినట్లు– ప్రాచీన వాఙ్మయం నుండి తెలుస్తోంది. హనుమంతుడు తనను సేవించే భక్తులకు ఆధ్యాత్మికోన్నతిని ప్రసాదిస్తున్నాడు. శ్రీ వైష్ణవ సాంప్రదాయంలో హనుమద్వాహన సేవను సిరియ తిరువడిగా కీర్తిస్తారు.

# టార్గెట్ పరిటాల.. గోరంట్ల నయా స్కెచ్

విజయవాడ: ఒక వరలో రెండు కత్తులు పట్టవంటారు. కానీ అక్కడ మాత్రం కాదు. ఒకటో కృష్ణుడు బెంగళూరు వెళ్లగానే.. రెండో కృష్ణుడు ఢిల్లీ నుంచి దైరెక్టుగా దిగేస్తారు. ఇప్పుడు పార్టీ కేడర్ ఇటు వైపుండాలా? అటు వైపుండాలా? ఎటూ తేల్చుకోలేక పోతున్నారట. మరి ఈ సమస్యకు పరిష్కారమేంటి? ఆ పర్యవసానం ఎలాంటిది? ఇప్పుడు చూద్దాం..

ఒకరు పోలీసులతో ఢీ అంటే ఢీ

ఢీ అంటే ఢీ.. బాహా బాహీ.. నువ్వెంత అంటే నువ్వెంత? ఈ నియోజకవర్గం నాదంటే నాది.. ఇదీ రాప్తాడు వైసీపీలో సాగుతున్న రసవత్తర నాటకంలోని కొన్నంటే కొన్ని దృశ్యాలు.. అలెర్డీ ఉద్యోగం ఊడిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి.. అసలే ఉద్యోగమూ లేని గోరంట్ల.. ఇరువురి మధ్య రాప్తాడులో నువ్వా నేనా సై అంటే సై అన్నట్లుగా వ్యవహారం సాగుతోందట.

ఇరువురి మధ్య రాప్తాడులో నువ్వా– నేనా

ఒకరిపై మరొకరు ఆధిపత్యం చెలాయించుకునేందుకు రాప్తాడు వేదికగా పోరాటం సాగిస్తున్నారట. ఒకపక్క ముచ్చటగా మూడో సారి ఎమ్మెల్యే అయిన పరిటాల సునీత– సవాల్ విసురుతూనే.. మరోపక్క గోరంట్ల మాధవ్ ను ఎలా కట్టడి చేయాలో అర్థం కాక బుర్ర బద్దలు కొట్టుకుంటున్నారట తోపుదుర్తి.

తోపుదుర్తి ఇక్కడ అంటూ మీసం మెలేస్తోన్న ప్రకాష్ రెడ్డి

అదేంటండీ ఆయన మీ నియోజకవర్గంపై కన్నేశారు? మీ కామెంట్ ఏంటని అంటే, ఇన్నాళ్లు ఇక్కడ ఎమ్మెల్యే ఎవరు? ఇప్పటి వరకూ ఈ నియోజకవర్గ బాధ్యతలు ఎవరు చూశారు? నిన్న రామగిరి ఎంపీపీ ఎన్నిక విషయంలో టీడీపీ తో తొడగొట్టిందెవరు.. తోపుదుర్తి ఇక్కడ.. అంటూ ప్రకాష్ రెడ్డి మీసం మెలేస్తున్నారట.

మరంత తోపైతే బెంగళూరు ఎందుకు పారిపోతున్నట్లు–గోరంట్ల

అదేంటండీ ప్రకాష్ రెడ్డి అలాగంటున్నారని గోరంట్లను అడిగితే.. మరి ఆయనంత.. తోపైతే బెంగళూరు ఎందుకు పారిపోతున్నట్లు? కౌంటర్ అటాక్ చేస్తున్నారాయన. దానికి తోడు ఈ సెగ్మెంట్లో తన సామాజిక వర్గ ఓటర్లు కూడా అత్యధికంగా ఉండటంతో.. ఈ టికెట్ ఎలాగైనా సాధించాలన్న ఆలోచనతో ఉన్నారట గోరంట్ల. ఈ ఏడాది జనవరి ఒకటిన రామగిరికి చెందిన కొందరు స్థానిక నేతలు గోరంట్ల మాధవ్ కు రాప్తాడు బాధ్యతలు అప్పగిస్తారన్న ప్రచారం చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన ప్రకాష్ రెడ్డి వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయించారు. స్థానిక బీసీ వర్గంలో ప్రకాష్ రెడ్డి తమకు వద్దంటూ.. అంతర్గత సమావేశాల్లో తమ నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ మేరకు రామగిరి జడ్పీటీసీ తో పాటు కుంటిమద్ది సర్పంచ్, ఎంపీటీసీ రాజీనామాలు చేయడానికి కూడా సిద్దపడ్డట్టు అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

గోరంట్ల ఎప్పటికప్పుడు కూటమిపై కామెంట్లు

ఇక్కడ తన వర్గానికి ఎలాగూ పట్టుంది కాబట్టి.. గోరంట్ల పెద్ద స్కెచ్చే వేసినట్టు తెలుస్తోంది. ఏ మాత్రం అవకాశం దొరికినా అస్సలు వదులుకోవడం లేదట.



ఎప్పటికప్పుడు కూటమి ప్రభుత్వంపై కామెంట్లు గుప్పిస్తున్నారు. అదే నోటితో.. ఎమ్మెల్యే పరిటాల కుటుంబంపైనా ఘాటైన వ్యాఖ్యలు చేస్తున్నారు.

పరిటాల సమీప బంధువులే ఈ హత్యకు కారకులన్న కామెంట్లు

మొన్న తగరకుంట దాడిలో గాయపడ్డ వైసీపీ నేతను అందరికంటే ముందుగా పరామర్శించారు గోరంట్ల. అంతే కాదు వైసీపీ నేత కురుబ లింగయ్య మృతదేహానికి నివాళులర్పించి.. పోలీసులతో తలబడ్డారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి కూడా పోలీసుల అనుమతులు కావాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందంటూ.. కూటమి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. అంతే కాదు పరిటాల సమీప బంధువులే ఈ ఘాతుకానికి పాల్పడ్డారంటూ.. పరిటాల శ్రీరామ్ ను టార్గెట్ చేశారు. తమ పాలనలో హింసా రాజకీయాల్లేవనీ. అదే కూటమి ప్రభుత్వం వచ్చాక ఫ్యాక్షన్ తిరిగి ప్రారంభమైనట్టు చెప్పుకొచ్చారు గోరంట్ల.

రామగిరి ఎంపీపీ ఎన్నికలను 2వారాలు వాయిదా వేయించిన తోపుదుర్తి

ఇలా ఎటు నుంచి ఎటు చూసినా.. గోరంట్ల గట్టి పట్టే బిగిస్తున్నారట. ఈ విషయం గుర్తించిన ప్రకాష్ రెడ్డి.. ఇటీవల రామగిరి ఎంపీపీ ఎన్నికలను రెండు వారాల పాటు వాయిదా వేయించగలిగారు. కానీ, తిరిగి తనను కేసులు తరుముకు రావడంతో.. తిరిగి బెంగళూరు పారిపోయారట. ఇదే అదనుగా భావించిన గోరంట్ల ఢిల్లీ నుంచి వచ్చి తిరిగి తనదైన శైలిలో యాక్టివ్ అయ్యారట. హస్తిన నుంచి వచ్చీ రాగానే, లింగమయ్య మృతికి నిరసనగా ఛలో పాపిరెడ్డి పల్లి అంటూ పిలుపునిచ్చి హల్ చల్ చేశారట.

ఎవరు ఇంచార్జో ఒక క్లారిటీ ఇవ్వొచ్చుగా– కార్యర్తల ఆవేదన

ఇటు పోలీసులకు అటు కార్యకర్తలకు ఈ ఇరువురి నేతల పోరాటం విషయంలో.. ఏం చేయాలో అర్థం కావడం లేదట. మరీ ముఖ్యంగా పార్టీ కార్యకర్తలకైతే తాము ఎవరి వైపున ఉండాలో అర్థం కావడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. మరి చూడాలి. అధిష్టానం వీరి మధ్య ఈ పోటీ ఎందుకు పెడుతోందో? గోరంట్లను ఎందుకు ఎగదోస్తుందో.. తేలాల్సి ఉందంటున్నారు. ఒక వేళ ప్రకాష్ రెడ్డికి ఇక్కడ ఛాన్స్ లేదంటే చెప్పేయవచ్చు కదా? అదే గోరంట్ల

## వైద్యం వ్యాపారంగా మారింది

విజయవాడ, గతంలో పోలిస్తే.. ఇప్పుడు వైద్యం వ్యాపారంగా మారిందని ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.. విజయవాడలో జరిగిన ఏపీ మెడికల్ కౌన్సిల్ లో నామినేటెడ్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఆరుగురు సభ్యులను నామినేటెడ్ పోస్టుల్లో ఎన్నుకున్నాం.. వారందరికీ అభినందనలు తెలియ జేస్తున్నాను... మంచి అనుభవం కలిగిన డాక్టర్లను ప్రభుత్వం ఎన్నుకుందన్నారు.. తరతరాలుగా వైద్యుల్ని దేవుడు పోల్చేవారు.. ఇదివరకు పోలిస్తే ఇప్పుడు వైద్యం వ్యాపారంగా మారిందన్న ఆయన.. డాక్టర్లు రోగులను మానవత దృష్టితో చూడాలని సూచించారు.. వైద్యవృత్తి విలువలు పల్చబడ్డాయి.. అవసరం లేకుండానే ఎక్సరేలు, సిటీ– స్కానింగ్, ఎంఆర్ఐ స్కానింగ్ లు తీస్తున్నారు.. అలాగే నార్మల్ డెలివరీ చేయడం మానేశారు.. అవసరం లేకపోయినా ఆపరేషన్ చేస్తున్నారు.. ప్రభుత్వ డాక్టర్లు గానీ.. ప్రైవేట్ డాక్టర్లు గానీ నార్మల్ డెలివరీస్ చేస్తే బాగుంటుందన్నారు.. ప్రజలు కూడా రకరకాల టెస్టులు రాస్తేనే మాకు సరిగ్గా డాక్టర్లు చూశారని అపోహలో ఉన్నారని వ్యాఖ్యానించారు మంత్రి సత్యకుమార్.. అటు–వంటి వారికి అవగాహన కల్పించాలి.. వచ్చిన పేషెంట్ ను చిరునవ్వుతో డాక్టర్లు స్వాగతం పలకాలని సూచించారు.. డాక్టర్లు సర్టిఫికెట్లను ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలి.. కొత్త కౌన్సిల్, ఏపీఎంసీ సర్టిఫికెట్స్ రెన్యువల్ మీద ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు.. ఫారెన్ రిటర్న్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఎక్కువగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం లేదు.. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఏపీఎంసీ సభ్యులుగా డాక్టర్ గోగినేని సుజాత, డాక్టర్ కె.వి.సుబ్బానాయుడు, డాక్టర్ డి.శ్రీహరిబాబు, డాక్టర్ స్వర్ణగీత, ఎస్.కేశవరావు బాబు, డాక్టర్ సి.మల్లీశ్వరి ప్రమాణస్వీకారం చేయగా వారికి అభినందనలు తెలిపారు.. రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపరచడానికి, నైతిక ప్రమాణాలను కాపాడటానికి ప్రభుత్వం కట్టు–బడి ఉందని చెప్పడానికి నిపుణులైన వైద్యులను ఏపీఎంసీ సభ్యులుగా నియమించడమే నిదర్శనం. అందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని, వైద్య రంగాన్ని ఆదర్శనీయంగా నిలపాలని కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన సభ్యులను ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ కోరారు..

## కేంద్రీకరణ దిశగా ప్రభుత్వం తీరు

న్యూఢిల్లీ,ప్రస్తుత ప్రభుత్వ మూడు అంశాల ఎజెండా విద్యా రంగంలో వినాశకరమైన పరిణామాలకు దారితీస్తోందని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ విమర్శించారు. సెంట్రలైజేషన్, కమర్షియలైజేషన్, కమ్యూనలైజేషన్ అనే మూడు సి... లు దేశ విద్యా విధానాన్ని శాసిస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత దశాబ్దంలో అధికారాన్ని కేంద్రీకరించడం, విద్యను వ్యాపారంగా చేయడం, పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాలు మతతత్వం చేయడం వారికి తెలిసిన పక్రియ అని సోనియా విమర్శించారు. తాజాగా ఒక పత్రికకు రాసిన వ్యాసంలో ఆమె దేశంలోని పలు అంశాలపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత 11 సంవత్సరాలుగా ఈ ప్రభుత్వ పనితీరు కేంద్రీకరణ దిశగా సాగుతోందని, అత్యంత హానికరమైన పరిణామాలు విద్యా రంగంలోనే ఉన్నాయని సోనియా అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా మంత్రులతో కూడిన కేంద్ర విద్యా సలహా మండలి సమావేశం 2019 సెప్టెంబర్ నుండి ఇప్పటివరకూ జరుపలేదన్నారు.జాతీయ విద్యా విధానం 2020 అమలుపై రాష్ట్ర ప్రభుత్వాలతో కనీసం ఒక్కసారైనా చర్చలు జరిపారా అని ఆమె నిలదీశారు. విద్య కేంద్ర రాష్ట్రాల ఉమ్మడి అంశమైనా కేంద్ర ప్రభుత్వం ఒంటరి పోకడలకు పోతోందని విమర్శించారు. విద్యావ్యవస్థ ద్వారా చిన్నారుల్లో విద్వేషాన్ని పెంచడమనే ఆరెస్సెస్, బీజేపీ సుదీర్ఘ కాంక్షను ఇప్పుడు నెరవేర్చుకుంటున్నారని ఆమె అన్నారు. మహాత్మా గాంధీ హత్యోదంతాన్ని, మొగలుల పాలనా విషయాలను పుస్తకాల నుంచి ఎందుకు తొలగించారన్నారు. తగిన నైపుణ్యాలు లేకపోయినా ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీల్లో వారి సిద్ధాంతాలకు అనుగుణంగా ఉన్నవారికే కీలక బాధ్యతలు అప్పగిస్తున్నారని సోనియా ఆక్షేపించారు. విద్యావ్యవస్థపై సాగుతున్న ఈ మారణహోమం వెంటనే ఆగిపోవాలని సోనియా తన వ్యాసంలో కోరుకున్నారు.

## భారత్ చీనీ భాయీభాయీ.. జిన్‌పింగ్ ఆశాభావం

బీజింగ్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్, చీనీ భాయీభాయీ అన్న నినాదాన్ని తెరపైకి తెచ్చారు. ఇరుదేశాలు మరింత సన్నిహితంగా కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. భారత్– చైనా దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన పరస్పర స్నేహం కోసం చేయిచాచరు. ఈ మేరకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో పరస్పర అభినందన సందేశాలను ఇచ్చిపుచ్చుకున్నారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు ఏనుగు– డ్రాగన్‌లా అభివృద్ధి చెందాలని అన్నారు. 2020లో తూర్పు లద్దాఖ్‌లో సైనికుల మధ్య తీవ్ర ఘర్షణతో ఇరు దేశాల మధ్య స్తంభించిన సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నాలు కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం చోటు– చేసుకోవడం విశేషం. పొరుగు దేశాలు శాంతియుతంగా ఉండేందుకు మార్గాలను అన్వేషించాలన్న జిన్‌పింగ్.. కీలకమైన అంతర్జాతీయ వ్యవహారాల్లో సంప్రదింపులు, సమన్వయాన్ని మరింతగా పెంచుకొనేందుకు, సరిహద్దు ప్రాంతాల్లో శాంతిని సంయుక్తంగా కాపాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మరోవైపు.. భారత్– చైనా మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి నేటికి 75 ఏళ్లు అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ అన్నారు. చైనా అధ్యక్షుడు, ప్రధాని.. భారత రాష్ట్రపతి, ప్రధానిలతో అభినందన సందేశాలు ఇచ్చిపుచ్చుకున్నట్లు– మీడియా సమావేశంలో వెల్లడించారు. రెండు దేశాలూ పురాతన నాగరికతలు కలిగి ఉన్నాయని, ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు అన్నారు. గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన సభ్యులైన ఇరు దేశాలూ ఆధునికీకరణలో కీలక దశలో ఉన్నాయని పేర్కొన్నారు.

## వంశీ రిమాండ్ 15 వరకు పొడిగింపు

విజయవాడ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ కేసులో ఈ రోజు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి.. వల్లభనేని వంశీ రిమాండ్‌ను జిల్లా కోర్టు పొడిగించింది.. ఆత్కురులో 9 ఎకరాలు కబ్జా చేసేందుకు ప్రయత్నించారని నమోదైన కేసులో వల్లభనేని వంశీకి రిమాండ్ పొడిగించింది. వంశీ రిమాండ్‌ను ఈ నెల 15వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు– ప్రకటించింది.. మరోవైపు, వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా వేసింది.. గన్నవరంలో సీతామహాలక్ష్మి అనే మహిళ స్థలం కబ్జా చేశారన్న కేసులో బెయిల్ ఇవ్వాలని వంశీ పిటిషన్ దాఖలు చేయగా.. విచారణ గురువారానికి వాయిదా వేసింది.. మరోవైపు.. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఏ1గా ఉన్న వంశీ ప్రధాన అనుచరుడు రంగాను సీఐడీ కస్టడీకి ఇచ్చింది న్యాయస్థానం.. దీంతో, బుధవారం నుంచి మూడు రోజుల పాటు రంగను సీఐడీ అధికారులు విచారించనున్నారు..

# ఎవరి లిమిటేషన్లు వారివి!



హైదరాబాద్,నిజానికి రేవంత్ రెడ్డి ఒక జాతీయ రాజకీయ పార్టీకి సంబంధించిన నాయకుడు. కాంగ్రెస్ పార్టీ దక్షిణాదినే కాకుండా ఉత్తరాదిన, మధ్యభారతంలో కూడా తన పార్టీ ప్రయోజనాలను గురించి ఆలోచించవలసిన అవసరం ఉంటుంది. అయిన ప్పటికీ దక్షిణాది సమస్యను తీసుకొని ముందుకు పోవడానికి రేవంత్ ఉద్యుక్తులయ్యారంటే బహుశా కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం కూడా దీనికి అను కూలంగానే ఉండి ఉండవచ్చు. దక్షిణాదిలో ఎలా పాగా వేయాలా అని ఆలోచిస్తున్న భారతీయ జనతా పార్టీకి ఈ డీలిమిటేషన్ వ్యవహారం తల నొప్పిగా తయారు కాబోతున్నది అన్నది స్పష్టం.ఒకవైపు జనాభాను పెంచుకుందామని మాట్లాడుతు న్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డీలిమిటేషన్ విషయం మాత్రం మాట్లాడటం లేదు. ఒకప్పుడు కేంద్రాన్ని, ఉత్తరాది పెత్తనాన్ని ఊగిపోతూ వ్యతిరేకించిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ అంశం మీద నోరు తెరవడానికి కూడా సిద్ధంగా లేరు. తమ మీద హిందీ రుద్దడాన్ని సహిం చబోమంటూ తమిళనాడులో ఉద్యమం చేయడానికి అక్కడి అధికారపక్షంతో సహా పలు వర్గాలు సిద్ధమవు తున్న తరుణంలో దాన్ని వ్యతిరేకిస్తూ బహిరంగసభల్లో మాట్లాడిన పవన్ కళ్యాణ్ డీలిమిటేషన్ వల్ల దక్షిణాదికి జరగబోతున్న నష్టాన్ని గురించి మాత్రం పల్లెత్తు మాట అనడం లేదు.ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం ప్రతిపక్షంగా ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఒక మంచి అవకాశాన్ని జారవిడుచుకున్నారేమో అనిపిస్తోంది. డీలిమిటేషన్ ను జనాభా ప్రాతిపదికన చేయవద్దని ప్రధానమంత్రిని కోరుతూ ఒక లేఖ రాసి ఊరుకు న్నారాయన. ఆయన ఈ అవకాశాన్ని ఉపయోగిం చుకుని ఉంటే రాజకీయంగా బాగుండేది. అలా కా కుండా కేవలం ప్రధానమంత్రికి లేఖ రాసి ఊరుకోవ డంవల్ల ఆయన భారతీయ జనతా పార్టీకి అనుకూలం గా ఉన్నాడనే వాదనకు బలం చేకూర్చినట్టయింది.జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరపకూడదని, అలా జరిగితే దక్షిణాదికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదిస్తున్న తరుణంలో, మిగతా దక్షిణాది రాష్ట్రాలు ఇదే బాటలో నడవడానికి సంసిద్ధమవుతున్న సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజకీయ పక్షాలు మాత్రం ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడ్డట్టు కనిపిస్తున్నది. గత వారం చెన్నైలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ నాయకత్వంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల రాజకీయ పక్షాల సమావేశానికి కర్ణాటక నుంచి అక్కడి ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్, కేరళ నుంచి ముఖ్యమంత్రి పినరయి విజయన్, తెలంగాణనుంచి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ప్రతిపక్షంనుంచి కెటి రామారావు తదితరులు హాజరై డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా బలమైన గొంతుక వినిపించిన తర్వాత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదుపరి సమావేశం హైదరాబాదులో జరుగుతుందని ప్రకటించి శాసనసభలో ఏకగ్రీవ తీర్మానాన్ని కూడా చేయించి కేంద్రం మీద డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించారు.నిజానికి రేవంత్ రెడ్డి ఒక జాతీయ రాజకీయ పార్టీకి సంబంధించిన నాయకుడు. కాంగ్రెస్ పార్టీ దక్షిణాదినే కాకుండా ఉత్తరాదిన, మధ్య భారతంలో కూడా తన పార్టీ ప్రయోజనాలను గురించి ఆలోచించవలసిన అవసరం ఉంటుంది. అయినప్పటికీ దక్షిణాది సమస్యను తీసుకొని ముందుకు పోవడానికి రేవంత్ ఉద్యుక్తులయ్యారంటే బహుశా కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం కూడా దీనికి అనుకూలంగానే ఉండి ఉండవచ్చు. దక్షిణాదిలో ఎలా పాగా వేయాలా అని ఆలోచిస్తున్న భారతీయ జనతా పార్టీకి ఈ డీలిమిటేషన్ వ్యవహారం తలనొప్పిగా తయారు కాబోతున్నది అన్నది స్పష్టం.1976 లోనే శ్రీమతి ఇందిరాగాంధీ ఈ డీలిమిటేషన్‌ను 25 సంవత్సరాలపాటు నిలిపివేస్తూ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చారు. ఆ లెక్కన 2001లో జరగాల్సిన డీలిమిటేషన్‌ను మళ్లీ ఎన్‌డిఎ ప్రభుత్వం అటల్ బిహారి వాజ్‌పేయి నాయకత్వంలో మరో 25 సంవత్సరాలపాటు వాయిదావేసింది. లెక్క ప్రకారం ఇక డీలిమిటేషన్ 2026లో జరగవలసి ఉంటుంది. ఈలోగా మరో 25 సంవత్సరాలపాటు డీలిమిటేషన్ వాయిదా వేయాలని కోరుతూ దక్షిణాది రాష్ట్రాలు తీర్మానాలు చేస్తున్నాయి. దీనికి కారణం ఉంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలుపరిచిన కారణంగా దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తగ్గిపోవడం వల్ల ఈ సమస్య ఎదురవుతున్నదనేది స్పష్టం.జనాభా లెక్కన గనుక ఇప్పుడు డీలిమిటేషన్ జరిగినట్టయితే దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంటు స్థానాలు తగ్గడం ఖాయం. అందుకే దక్షిణాది రాష్ట్రాల రాజకీయ పక్షాలు డీలిమిటేషన్‌ను జనాభా ప్రాతిపదికన కాకుండా అభివృద్ధి సూచికల ఆధారంగా జరపాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మొదలుకొని భారతీయ జనతా పార్టీకి సంబంధించిన ఇతర నాయకులు అనేకమంది మాట్లాడుతున్న మాటలు చాలా అస్పష్టంగా ఉన్నాయి. అవి మరిన్ని అనుమానాలకు దారితీసి దక్షిణాది నెత్తిమీద డీలిమిటేషన్ కత్తి వేలాడుతున్నదనే సందేహానికి మరింత బలం చేకూరుస్తున్నాయి.కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల తమిళనాడులోని కోయంబత్తూరు, తిరువణ్ణామలై, రామనాథపురం ప్రాంతాల్లో బిజెపి పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవానికి హాజరైన సందర్భంగా దక్షిణాది రాష్ట్రాలు డీలిమిటేషన్ వల్ల ఒక్క స్థానం కూడా కోల్పోబోవడం లేదని చెప్పారు తప్ప జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరపబోమనే హామీని మాత్రం ఇవ్వలేదు. మిగతా బిజెపి నాయకులు కూడా ఇదే పద్ధతిలో మాట్లాడుతున్నారు. తెలంగాణకు సంబంధించిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ గాని, ఇతరులు గాని ఇదే మాట చెబుతున్నారు. ఒక్క సీటు కూడా తగ్గబోదు అంటారే తప్ప జనాభా ప్రాతిపదికన జరపబోమనే మాట మాత్రం చెప్పడం లేదు.ఒకవైపు జనాభాను పెంచుకుందామని మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డీలిమిటేషన్ విషయం మాత్రం మాట్లాడటం లేదు. ఒకప్పుడు కేంద్రాన్ని, ఉత్తరాది పెత్తనాన్ని ఊగిపోతూ వ్యతిరేకించిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ అంశం మీద నోరు తెరవడానికి కూడా సిద్ధంగా లేరు. తమ మీద హిందీ రుద్దడాన్ని సహించబోమంటూ తమిళనాడులో ఉద్యమం చేయడానికి అక్కడి అధికారపక్షంతో సహా పలు వర్గాలు సిద్ధమవుతున్న తరుణంలో దాన్ని వ్యతిరేకిస్తూ బహిరంగ సభల్లో మాట్లాడిన పవన్ కళ్యాణ్ డీలిమిటేషన్ వల్ల దక్షిణాదికి జరగబోతున్న నష్టాన్ని గురించి మాత్రం పల్లెత్తు మాట అనడం లేదు. భారతీయ జనతా పార్టీతో కలిసి కూటమిగా ఏర్పడి ప్రభుత్వాన్ని నడుపుతున్న కారణంగా తెలుగుదేశం, జనసేన పార్టీలు రెండూ ఆంధ్రప్రదేశ్‌కు నష్టం చెయ్యడానికి సిద్ధమవుతున్నట్టు అర్థమవుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ప్రతిపక్షంగా ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఒక మంచి అవకాశాన్ని జారవిడుచుకున్నారేమో అనిపిస్తుంది. డీలిమిటేషన్‌ను జనాభా ప్రాతిపదికన చేయవద్దని ప్రధానమంత్రిని కోరుతూ ఒక లేఖ రాసి ఊరుకున్నారాయన. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత సర్వస్వతంత్రులు. అటు తెలుగుదేశం, జనసేన పార్టీలకు ఉన్నమిత్రకూటమి సమస్య లేదు. ఇటు రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జాతీయ పార్టీ కాంగ్రెస్‌కున్న ఉత్తరాది సమస్యలేదు. జగన్ మోహన్ రెడ్డి, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మంచి మిత్రులు. 2019లో జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పుడు ప్రమాణ స్వీకారోత్సవానికి స్టాలిన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మొన్న చెన్నైలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల రాజకీయ నాయకుల సమావేశానికి కూడా జగన్ మోహన్ రెడ్డిని కలిసి డిఎంకె పార్టీ నాయకులు స్వయంగా ఆహ్వానించారు కూడా. ఆయన ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఉంటే రాజకీయంగా బాగుండేది. అలా కాకుండా కేవలం ప్రధానమంత్రికి లేఖ రాసి ఊరుకోవడంవల్ల ఆయన భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా ఉన్నారనే వాదనకు బలం చేకూర్చినట్టయింది. ఒక విషయం అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ పాల్గొంటున్న ఏ కూటమిలోనూ ఎటువంటి కార్యక్రమంలో కూడా పాల్గొనడానికి జగన్మోహన్ రెడ్డి ఇష్టపడకపోవచ్చు. ఎందుకంటే పార్టీ ప్రారంభించిన తొలినాటినుంచి కూడా ఆయన కాంగ్రెస్ పట్ల చాలా స్పష్టంగా వ్యతిరేకత ప్రకటిస్తూ వచ్చారు. కాంగ్రెస్ ఆయనకు చేసిన నష్టం అటువంటిది మరి. కానీ అలా అని దక్షిణాది రాష్ట్రాలన్నీ ఒక్కటే ఒక బలమైన నాయకత్వాన్ని ముందుకు తీసుకుపోయే క్రమంలో తానొక ముఖ్యపాత్ర నిర్వహించే అవకాశాన్ని ఆయన కోల్పోయారు.తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పక్షానికి, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారత రాష్ట్ర సమితికి పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. కానీ ఆ రెండు పక్షాలు డీలిమిటేషన్ అంశం మీద ఒకే రకమైన వాదన వినిపిస్తున్నాయి. చెన్నైలో స్టాలిన్ ఏర్పాటు చేసిన సమావేశానికి అధికార పక్షం నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందంతోపాటు ప్రతిపక్ష ప్రతినిధి బృందానికి మాజీ మంత్రి కెటి రామారావు నాయకత్వం వహించిన విషయం తెలిసిందే. దక్షిణాదికి జరగబోతున్న ఈ అన్యాయాన్ని ఎదిరించడానికి అన్ని రాజకీయపక్షాలు కలిసి ఉంటే కేంద్ర ప్రభుత్వంలోని భారతీయ జనతా పార్టీ వెనక్కు తగ్గే అవకాశాలు ఉండేవేమో. ఇప్పటికైనా దక్షిణాదిన అధికారంలోకి రావాలని ఆశిస్తున్న భారతీయ జనతా పార్టీ డీలిమిటేషన్ విషయంలో పట్టుదలకుపోతుందా అనేది సందేహాస్పదమే.ప్రస్తుతం లోక్‌సభలో 24 శాతం స్థానాలు ఉన్న దక్షిణాది ఇప్పుడు జనాభా ప్రాతిపదికన గనుక డీలిమిటేషన్ జరిగినట్టయితే 19 శాతానికి పడిపోయే ప్రమాదం ఉన్నది. 24 శాతం స్థానాలు ఉన్నప్పుడే కేంద్రంనుంచి రాష్ట్రాలకు అందుతున్న నిధుల పరిస్థితి ఏమిటో శాసనసభలో రేవంత్ రెడ్డి వివరంగా చెప్పారు. తెలంగాణ రాష్ట్రం కేంద్రానికి పన్నుల రూపంలో ఒక రూపాయి చెల్లిస్తే అక్కడినుంచి తిరిగి 45 పైసలు మాత్రమే తెలంగాణకు వస్తున్నాయి. అదే బీహార్ రాష్ట్రం కేంద్రానికి ఒక రూపాయి చెల్లిస్తే ఆ రాష్ట్రానికి ఆరు రూపాయలు తిరిగి పంపిస్తున్నది కేంద్రం. అదేమంటే జనాభా ఎక్కువ ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ ఆర్థిక సాయం అందాల్సిన అవసరం ఉందని కేంద్రం వాదన. పన్నుల రూపంలో మనం చెల్లిస్తున్న డబ్బు మనకు తిరిగి ఇచ్చే విషయంలో జరుగుతున్న ఈ అన్యాయాన్ని ఎదిరించాల్సిన అవసరం ఉందని చెప్పి రాష్ట్రాలు భావిస్తున్నాయి. మరో 25 ఏళ్లపాటు డీలిమిటేషన్ వాయిదా వేసినట్లయితే అప్పటికి జనాభా విషయంలో సమతుల్యత ఏర్పడే అవకాశం ఉంటుందని దక్షిణాది రాష్ట్రాల రాజకీయపక్షాల వాదన.దక్షిణాది రాష్ట్రాల రాజకీయపక్షాల వాదనను అంగీకరించి కేంద్రం డీలిమిటేషన్ వాయిదా వేస్తుందా లేక మొండిగా ముందుకు సాగుతుందా అనేది వేచి చూడాల్సిన విషయం. ఇక్కడో విషయం చెప్పుకోవాలి. ప్రస్తుతం ఉన్న పార్లమెంటు సభ్యుల సంఖ్య కంటే ఎక్కువమందికి అనుకూలంగా ఉండే విధంగా నూతన పార్లమెంట్ భవనాన్ని నిర్మించిన కేంద్రం ఇంకో 25 ఏళ్లపాటు ఈ ప్రక్రియను వాయిదా వేస్తుందా అనేది చర్చనీయాంశం. ప్రస్తుత నూతన పార్లమెంటు భవనంలో 888 మంది లోక్‌సభ సభ్యులు, 384 మంది రాజ్యసభ సభ్యులు కూర్చోవడానికి వీలైన వసతులు ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే బిజెపి డీలిమిటేషన్‌కు వెళ్లి పార్లమెంట్ స్థానాల సంఖ్యను పెంచుకునే ఆలోచనతోనే ఉందేమో అనే అనుమానం కలగక మానదు. ఏమైనా ఈ సంవత్సరం సెప్టెంబర్ నాటికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75 సంవత్సరాల వయసు పూర్తి చేసుకుంటారు. మరి భారతీయ జనతా పార్టీ విధాన నిర్ణయం ప్రకారం 75 సంవత్సరాల తర్వాత ఎవరూ పదవుల్లో ఉండడానికి వీల్లేదనే సూత్రం గనక వర్తింపజేసినట్లయితే ప్రధాన మంత్రి మారితే డీలిమిటేషన్ విషయంలో భారతీయ జనతా పార్టీ మనసు మారుతుందా చూడాలి.

# రేషన్ కార్డ్ ఉన్నా లేకపోయినా సన్నబియ్యం గ్యారెంటీ.. ఎలాగంటే..?



హైదరాబాద్,రేషన్ షాపుల్లో ఇచ్చే బియ్యాన్ని దాదాపు చాలామంది అన్నం వండుకోడానికి ఉపయోగించరు. దోశ పిండి కోసమో, ఇతరత్రా అవసరాల కోసమో దాన్ని వినియోగిస్తారు. రేషన్ బియ్యం తీసుకునే చాలామంది బహిరంగ మార్కెట్ లో సన్నబియ్యాన్ని కొనుక్కుంటారు. మరి రేషన్ షాపుల్లో బియ్యం ఇవ్వడం దేనికి. తినడానికి అంతగా పనికిరావు అని తెలిసినా కూడా ప్రభుత్వాలు వాటినే ఉచితంగా ఇస్తున్నామంటూ ప్రచారం చేసుకుంటాయి, పేదల్ని ఉద్ధరిస్తున్నామంటూ ఫోజులు కొడుతుంటాయి. కానీ తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కారు మాత్రం ఇలాంటి ప్రచారం తమకు అక్కర్లేదని చెబుతోంది. నిరుపేదలు కూడా సన్నబియ్యం తినాలనే తలంపుతో రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది.

సన్నబియ్యం ఎవరికి..?

గతంలో రేషన్ కార్డు అనేది ఒక గుర్తింపు కార్డులా ఉండేది. పావర్టీ లైన్ దిగువన ఉండేవారికి తెల్ల కార్డులు, ఆదాయం ఎక్కువగా ఉండే వారికి గోధుమ రంగు కార్డులు ఇచ్చేవారు. ఆ తర్వాత బిలో పావర్టీ లైన్ వారికి మాత్రమే కార్డులు ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డుల గురించి అసలు పట్టించుకోలేదు. దీంతో చాలామంది అర్హులు కనీసం రేషన్ బియ్యాన్ని కూడా తీసుకోలేకపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొత్త కార్డులు మంజూరు ప్రక్రియ మొదలు పెట్టింది. దరఖాస్తులు స్వీకరించారు, వాటిని ఫిల్టర్ చేసి కొత్త కార్డుల మంజూరు ప్రక్రియ మొదలు పెట్టారు. బీపీఎల్ కుటుంబాలకు మూడు రంగుల కార్డ్ లు మంజూరు చేయబోతున్నారు, పావర్టీ లైన్ పైన అంటే అబౌవ్ పావర్టీ లైన్(ఏపీఎల్)కుటుంబాలకు గ్రీన్ కలర్ కార్డ్ లు ఇస్తారు. అయితే ఈలోగా అంటే ఏప్రిల్-1 నుంచి రేషన్ కార్డులు ఉన్నవారికి సన్నబియ్యం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఉగాది సందర్భంగా ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తోంది. అయితే ఇక్కడ రేషన్ కార్డులు లేకపోయినా కూడా సన్నబియ్యం పొందే అవకాశాన్న ప్రజలకు కల్పించింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం.

రేషన్ కార్డ్ లేకపోయినా..?

ఇటీవల కొత్త రేషన్ కార్డులకోసం ప్రభుత్వం దరఖాస్తులు తీసుకుని లిస్ట్ రెడీ చేసింది. ఆ లిస్ట్ లో ఉన్న వారికి త్వరలో ఫిజికల్ రేషన్ కార్డులు ఇవ్వాల్సి ఉంది. ఈలోగా కొత్త పథకం తెచ్చారు కాబట్టి, అర్హులెవరూ నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం కొన్ని నిబంధనలు సడలించింది. అంటే ప్రస్తుతం రేషన్ కార్డ్ ఉన్నా లేకపోయినా, కొత్త కార్డు లిస్ట్ లో పేరుంటే కచ్చితంగా వారికి సన్నబియ్యం ఇస్తారు. సన్నబియ్యం పొందేందుకు రేషన్ కార్డ్ ప్రామాణికం కాదు అనేది ఇక్కడ ప్రభుత్వ విధానం. కొత్త కార్డుకి అర్హత ఉండి, ఆ లిస్ట్ లో పేరుంటే సన్నబియ్యం తీసుకోడానికి అర్హులేనంటూ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది.ప్రభుత్వ నిర్ణయం వల్ల దాదాపు 80నుంచి 84శాతం జనాభాకు సన్నబియ్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. గతంలో ఇచ్చే బియ్యాన్ని చాలామంది బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నారు. దాని వల్ల ప్రభుత్వానికి వ్యయం తప్ప ప్రజలకు ఉపయోగం ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఇచ్చే బియ్యాన్ని ప్రజలు నేరుగా వినియోగించుకుంటారు. అందుకే సన్నబియ్యం పంపిణీకి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. అందులోనూ రేషన్ కార్డ్ లేకపోయినా కూడా బియ్యం పంపిణీ చేయాలనే నిర్ణయాన్ని సామాన్యులు స్వాగతిస్తున్నారు. పేదల కష్టాలను పట్టించుకునే ప్రభుత్వం ఇది అని అభినందిస్తున్నారు.

# బంగ్లాదేశ్ తాట తీయకుండా ఆగుతున్నారేం మోడీ?

న్యూఢిల్లీ,ఏ దేశ స్వతంత్రం కోసం భారత్ తపించిందో.. అక్కడ జరుగుతున్న మారణహోమానికి చెక్ పెట్టి.. వారికి స్వేచ్ఛను స్వాతంత్ర్యాన్ని అందించామో.. ఇప్పుడు అదే గడ్డకు చెందిన తాత్కాలిక ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వైనం చూసినప్పుడు ఒళ్లు మండక మానదు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనుస్ వ్యవహరిస్తున్న తీరు అంతకంతకూ తీవ్రంగా మారుతోంది. ఆయన చేస్తున్న వ్యాఖ్యలకు పార్టీలకు అతీతంగా పలువురు నేతలు తప్పు పడుతుంటే.. మోడీ సర్కారు మాత్రం మౌనంగా ఉండటం.. ఆయన తాట తీసేలా బదులు ఇచ్చే విషయంలో వెనకుడుగులో ఉండటం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.బంగ్లాదేశ్ లో షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూలదోసి తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి రావటానికి కాస్త ముందు నుంచి భారత్ మీద బంగ్లాదేశ్ ప్రజల్లో విషాన్ని నింపే శక్తులు ఎక్కువ అయ్యాయి. తాత్కాలిక ప్రభుత్వంలో అది మరింత ఎక్కువైంది. తాజాగా చైనా పర్యటనలో ఉన్న యూనుస్ ఈశాన్య రాష్ట్రాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సెవన్ సిస్టర్స్ గా పిలిచే ఏడు ఈశాన్య రాష్ట్రాలకు సముద్రమార్గం లేదని.. సముద్ర తీరమున్న బంగ్లాదేశ్ ఒక రకంగా ఈ ఏడు రాష్ట్రాలకు సాగర రక్షకుడిగా ఉందన్నారు.ఈ ప్రాంతానికి సముద్రమార్గం లేకపోవటం చైనాకు ఒక సువర్ణ అవకాశంగా అభివర్ణిస్తూ.. ఈ ప్రాంతం పై చైనా తన ఆర్థిక సత్తాను చాటొచ్చని.. ఇక్కడ విస్తరించి.. ఉత్పత్తులు తయారు చేసి మార్కెటింగ్ చేసుకోవచ్చన్నారు. ఈ వ్యాఖ్యలపై ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రమే కాదు.. వివిధ రాజకీయ పార్టీలు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఈ వ్యాఖ్యల్లో ముఖ్యమైన ఒక వ్యాఖ్య చేశారు త్రిపురకు చెందిన తిప్రా మోతా పార్టీ చీఫ్.. రాజవంశీకుడు ప్రద్యోత్ దేబర్మా మాణిక్య ఘాటు వ్యాఖ్య చేశారు.'1947 బంగ్లాదేశ్ లోని చిట్టగాంగ్ నైకాశ్రయం మన చేతికి వచ్చినా వదిలేసుకోవటం అప్పట్లో చేసిన పెద్ద తప్పు' అని పేర్కొన్నారు. అస్సాం జాతీయ పరిషత్ అధ్యక్షుడు జొర్హాట్ ఎంపీ లురిన్ జయోతి గొగోయ్ స్పందిస్తూ.. 'ఏ దేశం విమోచన కోసం భారత్ పోరాడిందో ఇప్పుడు అదే దేశం శత్రుదేశంతో చేతులు కలపటం దారుణం. మన విదేశాంగ విధానం ఈ స్థాయికి దిగజారటం శోచనీయం' అని వ్యాఖ్యానించారు. అంతకంతకూ చెలరేగిపోతున్న బంగ్లాదేశ్ పాలకులకు సరైన రీతిలో సమాధానం ఇచ్చే విషయంలో మోడీ సర్కారు చేస్తున్న జాగుపై పలువురు తప్పు పడుతున్నారు. ఈ మౌనం ఏమిటి మోడీ? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది.



# రాజారెడ్డి రాజ్యాంగం... వైఎస్ ఫ్యామిలీ రాజకీయం

హైదరాబాద్,వైఎస్ షర్మిల.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తెగా, జగన్ సోదరిగా రాజకీయంగా బాగా పాపులర్ అయ్యారు. పదవుల కంటే పాదయాత్రలతో పాపులర్ అయిన వైఎస్ కుమార్తెకు రాజకీయంగా ఇప్పటి వరకూ ఒరిగిందేమీ లేదు. ఎన్నికల సమయంలో చెల్లి సేవలను వాడుకున్న జగన్ అధికారంలోకి రాగానే ఆమెను కూరలో కరివేపాకులా పక్కన పెట్టేశారు. దాంతో షర్మిల వైఎస్ఆర్‌టీపీ అంటూ తెలంగాణలో పార్టీ పెట్టి సుదీర్ఘకాలం పాదయాత్రలు చేశారు. అయితే సక్సెస్ మాత్రం కాలేకపోయారు. దాంతో తన పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు. అది జరిగిన వారంలోనే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ఆమెకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవం బాధ్యతలను షర్మిల భుజాలపై పెట్టి పీసీసీ ప్రెసిడెంట్‌ని చేశారు. ఆ పదవి కట్టబెట్టక ముందు నుంచే షర్మిలకు కాంగ్రెస్ మార్కు రాజకీయం ఎలా ఉంటుందో తెలిసి వచ్చింది. ఆమెను పీసీసీ ప్రెసిడెంట్ చేయవద్దని ముందు నుంచే అడ్డం పడే ప్రయత్నం చేశారు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ హర్షకుమార్. అయితే ఆ మాజీ ఎంపీ విన్నపాన్ని కాంగ్రెస్ హైకమాండ్ లైట్ తీసుకుంది. ఆ క్రమంలో హర్షకుమార్ కాంగ్రెస్‌కు రిజైన్ చేస్తారన్న ప్రచారం కూడా జరిగింది. మరెక్కడా ఓపెనింగ్స్ లేవేమో ఆ సీనియర్ నేత కాంగ్రెస్ చూరే పట్టుకుని వేలాడుతున్నారు.వైఎస్ షర్మిలకు ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించవద్దని హైకమాండ్‌ను కోరిన హర్షకుమార్, ఆమెకు కావాలంటే జాతీయ స్థాయి పదవి ఇవ్వండని ఉచిత సలహా కూడా ఇచ్చారు. తెలంగాణ బిడ్డ అని చెప్పుకుని తిరిగిన షర్మిల.. ఆంధ్రప్రదేశ్‌లో ఎలా చెల్లుబాటు అవుతుందని హర్షకుమార్ ప్రశ్నించారు. జగన్, షర్మిల ఇద్దరు ఒకటేనని ఎద్దేవా చేశారు. పెళ్లి కార్డు ఇచ్చేందుకు వెళ్లి షర్మిల తన అన్నతో అరగంటసేపు మంతనాలు జరపాల్సిన అవసరం ఏమొచ్చిందని కొత్తకొత్త డౌట్లు కూడా అప్పట్లో రెయిజ్ చేశారు. జగన్‌కు మోడీతో, షర్మిలకు సోనియాతో లింకు పెట్టేసి కేంద్రంలో రేపు ఏ ప్రభుత్వం వచ్చినా, తాము సేఫ్‌గా ఉండాలనేది జగన్, షర్మిల ఉద్దేశమని మండిపడ్డారు హర్ష కుమార్.అలాంటి హర్షకుమార్ చాపక్రింద నీరులా తాడేపల్లి కోటరీతో చేతులు కలిపారా అనే సందేహాలు ఇప్పుడు వ్యక్తం అవుతున్నాయి. తనను టార్గెట్ చేస్తున్న షర్మిలకు చెక్ పెట్టడంతో పాటు కూటమి సర్కారును ఇబ్బందుల్లో పెట్టడానికి జగన్ టీమ్ హర్షకుమార్ దళిత కార్డుని వాడుకోవడానికి స్కెచ్ గీస్తోందంట. కాంగ్రెస్ రక్తాన్ని వంటబట్టించుకున్న వైఎస్ ఫ్యామిలీ రాజారెడ్డి రాజ్యాంగాన్ని నడిపిస్తున్నదన్న ఆరోపణలున్నాయి. తమ రాజకీయ అవసరాల కోసం ఇంటాబయటా ఎవర్నైనా టార్గెట్ చేస్తారన్న టాక్ ఉంది. 1989లో వంగవీటి రంగా హత్య కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి దోహదపడింది. సీఎంను మార్చడానికి 1990లో హైదరాబాద్ మత కలహాలూ



ఆ పార్టీ సృష్టేనన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక 1999లో వరుసగా రెండో సారి ఓడిపోగానే చెన్నారెడ్డి తెలంగాణా అంటూ విభజన రాగం ఎత్తుకుని హడావుడి చేశారు. 2009లో వైఎస్ మరణం తర్వాత తన తండ్రిని రిలయన్స్ వాళ్ళు చంపారని జగన్ అల్లర్లు సృష్టించారు. అదే జగన్ తాను అధికారంలో ఉన్నప్పుడు ముఖేష్ అంబానీకి తన తాడేపల్లి ప్యాలెస్‌లో రాజమర్యాదలు చేశారు. వైసీపీ కోటాలో అంబానీ టీమ్ మెంబర్‌కి రాజ్యసభ సభ్యత్వం కూడా కట్టబెట్టారు. 2015లో అప్పటి కూటమి సర్కారుని బదనాం చేయడానికి తుని ట్రైన్ తగలబెట్టించడానికి ముద్రగడను ముందు పెట్టి పావులు కదిపింది వైసీపీనే అన్న విమర్శలున్నాయి. ఇక అధికారంలోకి రావడానికి 2018లో కోడి కత్తి డ్రామా, 2019 ఎన్నికల ముందు సొంత బాబాయ్‌పై గొడ్డలి వేటు, అధికారంలోకి రాగానే మూడు రాజధానుల చిచ్చు, మొన్న ఎన్నికల ముందు పేదలు వర్సెస్ పెత్తందార్లు అంటూ నాటకం.. తాజాగా పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణాన్ని అడ్డంపెట్టుకుని రాజకీయం జగన్ పొలిటికల్ డ్రామాలకు పరాకాష్టగా నిలుస్తున్నాయి.ఎవరు అవునన్నా కాదన్నా కులం.. మతం.. ప్రాంతాలను అడ్డు పెట్టుకుని, శవ రాజకీయాలు చేస్తూ ఆ పునాదుల పైనే, వైఎస్ ఫ్యామిలీ ఎదిగి ఉందంటారు. అప్పుడు అయ్యా.. ఇప్పుడు కొడుకు.. తమ రాజకీయ ఎదుగుదల కోసం రాజారెడ్డి రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారనేది కాదనలేని వాస్తవం. ఇన్ని ఘటనలు కళ్ళ ముందు జరుగుతూ, రాష్ట్రం నష్టపోతున్నా, తెలుగుదేశం మీద ద్వేషంతోనో, కులం, మతం, ప్రాంతం మీద ఉండే ఉన్మాద అభిమానంతోనో, వాళ్ళని ఇంకా నమ్మే వాళ్ళు ఉండటం ఈ తెలుగు జాతి దౌర్భాగ్యమనే చెప్పాలి. లేకపోతే హైదరాబాద్ టూ బెజవాడ,రాజమండ్రి టూ వీలర్ ప్రయాణం చేస్తూ దురదృష్టవశాత్తు మరణించిన పాస్టర్ ప్రవీణ్ మృతిని కూడా రాజకీయం చేయడం ఏంటి?

# మోడీ వారసుడు అంటే...యోగీ రియాక్షన్ !



లక్నో:రాజకీయాలు తనకు ఫుల్ టైం జాబ్ కాదు అన్నారు ఉత్తరప్రదేశ్ బీజేపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్. తనకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసే అవకాశాన్ని ఇచ్చారని అందుకు ధన్యుడిని అని ఆయన మాట్లాడుతున్నారు తన బాధ్యతలు అయిపోగానే తిరిగి మఠానికి అంటున్నారు.ఈ విధంగా మాట్లాడడం చాలా మందికి సాధ్యం కాదు సగటు రాజకీయ నాయకుడికి అసలు సాధ్యం కాదు. యోగీ ఆదిత్యనాథ్ ని సగటు రాజకీయ నేతగా చూడాలా అంటే ఆయన గత పాతికేళ్ళుగా రాజకీయాల్లో ఉన్నారు. ఎంపీగా పనిచేశారు. రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు.ఆయన విషయంలో అయితే బీజేపీలో చాలా ఆశలు ఉన్నాయి. ఆయన ఇంకా ఎత్తులకు ఎదగాలని అనుచరులు కోరుకుంటున్నారు. అయితే యోగి ఆదిత్యనాథ్ మాత్రం తనకు ముఖ్యమంత్రి పదవి చాలు అని దండం పెట్టేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి వారసుడు మీరా అని అడిగితే దానికి కూడా కానే కాదు నేను ఏమిటో నాకు తెలుసు అని అంటున్నారు.యోగి మరి ఎందుకు ఇలా మాట్లాడుతున్నారు అన్నది చర్చగా ఉంది. ఆయన హిందూత్వకి ఫైర్ బ్రాండ్. ఆయన లాంటి వారే కావాలని బీజేపీలో అతి వాద వర్గానికి ఉంది. ఆర్ఎస్ఎస్ కి అయితే యోగి మీద ఎంతో అభిమానం నమ్మకం ఉన్నాయి. మోడీ ద్వారా మూడు సార్లు కేంద్రంలో బీజేపీకి అధికారం దక్కింది.ఏ కారణం చేత అయినా మోడీ ఇమేజ్ తగ్గి బీజేపీకి ఇబ్బంది వస్తే కనుక ఆ ప్లేస్ లోకి యోగిని తీసుకుని రావాలని ఆర్ఎస్ఎస్ ఆలోచన అని ప్రచారంలో ఉంది ఆర్ఎస్ఎస్ మొదటి ఆప్షన్ యోగీ అనే అంటారు. మోడీ వారసుడు అంటే యోగీకే ఓటు వేస్తారని కూడా చెబుతున్నారు.పైగా యూపీ వంటి పెద్ద స్టేట్ కి సీఎం గా రెండు సార్లు చేసిన యోగీకి ఇక దక్కాల్సింది ప్రధాని పదవి మాత్రమే అని అంటున్నారు. రాజకీయంగా చూసినా చిన్న వయసులో ఉన్న యోగీకి ఎందుకీ రాజకీయ వైరాగ్యం అని అంతా అంటున్న నేపథ్యం ఉంది.అయితే రాజకీయాల్లో కాదంటే అవును అనిలే అన్న మాట కూడా ఉంది. యోగీ ఈ రోజున సీఎం గా ఉన్నారు. మరో రెండేళ్ళ పాటు ఆయనకు ఈ పదవి ఉంది. ఇక ప్రధాని పదవి అయితే ఖాళీగా లేదు మోడీ అక్కడ ఉన్నారు. ఆయన పదవీ కాలం మరో నాలుగేళ్ళు ఉంది. ఏతా వాతా ఏమైనా చూసుకుంటే కనుక బీజేపీలో ప్రధాని పదవికి పోటీ పడటం అన్నది. 2029 నాటి మాట అని అంటున్నారు.అప్పటికి అంటే చాలా టైం ఉంది అందుకే ఈ రోజు నుంచే నేనే పోటీ నేనే మోడీకి వారసుడిని అని యోగి చెప్పుకోవడం వల్ల లాభం కంటే రాజకీయంగా నష్టం జరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. బీజేపీకి చెందిన ఎంతో మంది సీఎంలు ఉంటే వారిలో ప్రజాకర్షణ కలిగిన సీఎం గా యోగీకే ఎంతో పేరు ఉంది. జాతీయ స్థాయిలోనూ ఆయన గురించి మారుమోగుతుంది.మోడీకి వారసుడు అన్న మాట వచ్చినపుడల్లా అంతా యోగీ వైపే చూస్తున్నారు. దాంతో ఆయనకు ఉన్న స్థానం ఏమిటో అం దరికీ తెలుస్తోంది. అందుకే తానుగా ఏమీ కోరుకోవడం లేదని చాలా జాగ్రత్తగానే యోగీ మాట్లాడుతున్నారు అని అంటున్నారు. నిజానికి చూస్తే యూపీ సీఎం పదవిని కూడా ఆయన ఏమీ కోరుకోలేదు. అది ఆయనకు ఒకటికి రెండు సార్లు దక్కింది. అందువల్ల ఆయన ప్రధాని కావాలని రాసిపెట్టి ఉంటే కనుక అదే జరిగి తీరుతుంది అని అంటున్నారు.అందుకే యోగి నా రాజకీయం ఫుల్ టైం కాదని లౌక్యంగానే చెబుతున్నారు అని అంటున్నారు. అదన్న మాట మ్యాటర్.

### మయన్మార్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

న్యూఢిల్లీ, మయన్మార్ భూకంప మృతుల సంఖ్య అంతకంతకూపెరుగుతోంది. శుక్రవారం భూకంపం సంభవించిన ప్రాంతంలో రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోంది. శిథిలాలను తొలగించినా కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి. ఇప్పటివరకు 2,719 మంది మృతదేహాలను వెలికితీశారు. స్థానిక మీడియా తాజాగా ఈ విషయాన్ని వెల్లడించింది. మృతుల్లో 5 ఏళ్లలోపు చిన్నారులు 50 మంది ఉన్నారని తెలిపింది. మరో 4,521 మంది గాయపడ్డారని, ఇంకో 441 మంది ఆచూకీ లభ్యం కావాల్సి ఉందని పేర్కొంది. ఇప్పటికే సైనిక పాలన, అంతర్యుద్ధాలతో మగ్గిపోతున్న మయన్మార్‌పై గత శుక్రవానం సంభవించిన భూకంపం తీవ్ర ప్రభావాన్ని చూపించింది. భారీగా ప్రాణ, ఆస్తి నష్టానికి కారణమైంది. కొన్ని ప్రభావిత ప్రాంతాలకు సహాయక బృందాలు చేరుకోవడం కూడా కష్టంగా ఉంది. దాంతో శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటికి తీసుకురావడం ఆలస్యమవుతోంది. మాండలే వీధుల్లో మృతదేహాలు కుళ్లిపోతుండటంతో దుర్గంధం వెలువడుతోంది. మండుటెండలో ఉత్త చేతులతో, చిన్నచిన్న పారలతో శిథిలాలను తొలగిస్తూ ఎవరైనా ప్రాణాలతో ఉన్నారేమో తెలుసుకునేందుకు స్థానిక ప్రజలు ప్రయత్నిస్తు న్నారు. మాండలే ప్రాంతంలోనే ఓ ప్రీస్కూల్ కూలిపోవడంతో 50 మంది చిన్నారులు, ఇద్దరు టీ-చర్లు చనిపోయారని ఐరాస సిబ్బంది వెల్లడించారు. వివిధ దేశాల నుంచి వస్తోన్న సహాయక బృందాలు భూకంప ప్రాంతాలకు వెళ్లేందుకు ఆయా చోట్ల ప్రభుత్వ, తిరుగుబాటు- దళాల

# ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడుముక్కలాట!



ఖమ్మం:ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్నతాధికారుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి లా తయారైంది. ముగ్గురు మంత్రుల పర్యటనల నేపథ్యంలో వారి పరిస్థితి ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్న సామెతను తలపిస్తోంది.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర మంత్రివర్గంలో ముగ్గురికి అవకాశం లభించింది. ఈ ముగ్గురిలో తుమ్మల నాగేశ్వరావుకు గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. మిగిలిన ఇద్దరూ మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తొలిసారిగా మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు.జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండటంతో జిల్లా వాసులు ఆనందం వ్యక్తంచేశారు. కార్యకర్తలు కూడా తమ నాయకులు మంత్రులు అయ్యారనే సంతోష పడుతున్నారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ మంత్రులు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు మాత్రం అధికారులు హైరానా పడుతున్నారు. ముగ్గురులో ఎవరు జిల్లా పర్యటనకు వచ్చినా కలెక్టర్ తోపాటు జిల్లా స్థాయి అధికారులంతా కార్యక్రమాలకు హాజరు కావాల్సిందే. ఒక్కోసారి ముగ్గురూ జిల్లాలో ఉంటే అధికారులు పరుగులు పెట్టాల్సిందే. ఎవరి కార్యమంలో పాల్గొనకపోతే ఎమవుతుందోనని హడలిపోతున్నారు. అంతే కాకుండా మంత్రులు వరుస పర్యటనలతో అధికారులకు వారి కార్యక్రమాలకు హాజరు కావడానికే సమయమంతా సరిపోతోంది. వారంలో ముగ్గురు మంత్రులు జిల్లా పర్యటనకు వచ్చారంటే అధికారులు ఆఫీసులకు వెళ్లకుండానే పర్యటనలకు హాజరవుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించాల్సి ఉండటంతో పాటు కార్యాలయంలో ముఖ్యమైన ఫైళ్లు చూడాల్సి ఉంటుంది. ఎన్ని పనులు ఉన్నా మంత్రులు పర్యటనలకు వచ్చారంటే తప్పనిసరిగా హాజరుకావాల్సిందే. ఇక అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ కొరవడుతున్నది. ఈ పరిస్థితి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం రెండు జిల్లాల అధికారులు ఎదుర్కొంటున్నారు.. మరో వైపు ఖమ్మం పట్టణంలో ఏ మంత్రి పర్యటించినా పోలీసు, అధికార యంత్రాంగం అంతా మంత్రి కాన్వాయ్ లోనే ఉంటున్నారు..దీంతో పట్టణ ప్రజలు కూడా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. కాన్వాయ్ లో భారీగా వాహనాలు ఉండటం వల్ల కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు ప్రజల వాహనాలను నిలిపివేస్తున్నారు. కాన్వాయ్ లో మంత్రుల వాహనాలతో పాటు అనుచరగణం భారీగానే పాల్గొంటున్నారు.

# మార్పునకు సిద్ధమా జగన్?

అమరావతి,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక రకంగా అదృష్టవంతుడు. జగన్ నుంచి ఏమీ కోరుకోకుండానే ఆయన్ను అభిమానించే, ప్రాణమిచ్చే లక్షలాది మంది కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతే తల్లిడిల్లిన హృదయాలెన్నో ఉన్నాయి. ఐదేళ్ల పాలనలో తమను పట్టించుకోకుండా, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందించారని, అలాగే అభివృద్ధి పనులు చేశారని, కానీ ప్రచారం చేసుకోవడంలో విఫలం కావడంతోనే ఓటమి కొని తెచ్చుకున్నారనే వాదన వుంది.అలాగే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఆచరణకు నోచుకోని, అలివికాని హామీలు ఇచ్చి ప్రజల్ని మభ్యపెట్టారనే విమర్శ కూడా లేకపోలేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి వాస్తవాలు చెబుతూ, తాను ఇంతకంటే ఎక్కువ ఇవ్వలేనని జగన్ చెప్పడం, ప్రజలకు మింగుడు పడలేదని వైసీపీ శ్రేణుల వాదన. ఇవన్నీ కూడా నిజమే.స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ప్రజాప్రతినిధుల వీరోచిత పోరాటాలుపార్టీకి ఊపిరిపోశాయి.

ఇవాళ వాళ్లతో జగన్ కీలక సమావేశం నిర్వహించనున్నారు. పార్టీకి భవిష్యత్‌పై భరోసా కల్పించేలా బరిలో అధికార కూటమితో ఢీకున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులతో జగన్ భేటీ కావడం అభినందనలు అందుకుంటోంది.అలాగే శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లెలో హత్యకు గురైన కురుబ లింగమయ్య భార్య, కుమారులతోనూ జగన్ ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. భయపడొద్దని, తాను అండగా వుంటానని భరోసా ఇచ్చారు. వారంలో తాను వచ్చి కలుస్తానని జగన్ వాళ్లకు చెప్పారు. టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత బంధువుల చేతిలో హత్యకు గురయ్యారని ఆరోపణలున్నాయి. జగన్ నుంచి ఇలాంటి స్పందననే కార్యకర్తలు, నాయకులు కోరుకుంటున్నారు.జగన్ మాస్ లీడర్. జగన్ బలమే జనం. అలాంటిది జనానికి దూరమైతే, సహజంగానే జగన్‌పై అసంతృప్తి, ఆగ్రహం కలుగుతాయి. గత



ఎన్నికల్లో సొంత వాళ్లలో కూడా చాలా మంది ఆయనకు ఓటు వేయకపోవడానికి ప్రధాన కారణాల్లో ఇది ఒకటి. బహుశా తన వైపు నుంచి తప్పిదాలను ఆయన ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారనే అభిప్రాయం కలుగుతోంది. పార్టీ కోసం పనిచేసే వాళ్లతో మాట్లాడ్డానికి ముందుకొస్తున్నారు. జగన్‌లో మార్పు రావాలని కోరుకుంటున్న వాళ్లంతా, ఆయన శ్రేయోభిలాషులే.వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందా? రాదా? అనే భయం ఇప్పుడు ఆ పార్టీ శ్రేణుల్లో లేదు. ఎందుకంటే, కూటమి అధ్వాన పాలన పుణ్యాన అధికారంపై అప్పుడే శ్రేణుల్లో ధీమా కనిపిస్తోంది. జగన్‌లో చిన్న మార్పును వాళ్లు ఆశిస్తున్నారు. కోటరీని దూరం పెట్టి, నిజంగా పార్టీ కోసం పని చేస్తున్న వాళ్లతో మాట్లాడాలని ఆశిస్తున్నారు. ఈ పని చేస్తే చాలు, జగన్ కోసం ఏం చేయడానికైనా సిద్ధమని వాళ్లు అంటున్నారు. ఎన్నికల ప్రచారంలో జగన్ పదేపదే సిద్ధమా అని పార్టీ శ్రేణుల్ని ప్రశ్నించే వాళ్లు. కానీ ఇప్పుడు వాళ్లు మార్పునకు సిద్ధమా? అని జగన్‌ను ప్రశ్నిస్తున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com